
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
జిల్లా వార్తలు
శుక్రవారం 4 ఏప్రిల్ 2025 | 5





వసూళ్లు అంతంతే!

లక్ష్యానికి దూరంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లు
కొవ్వూరు, మండపేట మున్సిపాలిటీల్లో అత్యధిక వసూళ్లు 6



నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతి, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500 మందికిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

6



అదిగో.. శ్రీరామగిరి

రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశమిది

6



కర్పూర అధరహో!

7



రూ.171.33 కోట్లతో

సత్యదేవుడి ఆలయ బడ్జెట్

7

ఆదమరిస్తే.. అంతే!

టెన్త్.. ఇంటర్.. పరీక్షలు ముగిశాయి.. విద్యార్థులకు దాదాపుగా వేసవి సెలవులు వచ్చేశాయి.. చిన్న తరగతులకు చూస్తే ఒంటిపూట బడులు నడుస్తున్నాయి.. దీంతో ఆనందానికి హద్దే లేకుండాపోతోంది.. ప్రతిరోజూ ఈరోజు ఏంటీ అనే ఆలోచనే.. దీంతో చాలా మంది పిల్లలు.. యువత సరదాగా గడుపుదామని నదీ స్నానాల బాటపడుతున్నారు. అయితే ఆదమరుపుగా ఉన్నారో ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.. నది ఎంత ప్రశాంతంగా కనిపిస్తుందో ప్రమాదం జరిగిన తరువాత అంతే విషాదాన్ని మిగులుస్తోంది. అందుకే తస్మాత్ జాగ్రత్త.. నదిలో స్నానాలకు దిగినా రక్షణ చర్యలు తీసుకోవాల్సిందే. ఆదమరుపుగా ఉన్నామా మునిగిపోతామంతే..



ఇలాగే రాయించండి : ముక్కొల్లు చెక్‌డామ్ వద్ద హెచ్చరిక బోర్డులు రాయిస్తున్న పోలీసులు



చూస్తుండగానే వెళ్లిపోతారు జాగ్రత్త : తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గురువారం స్నానాలు చేస్తున్న సందర్శకులు

పేరులోనే గోదావరి ఉన్న జిల్లా మనది.. నీటికి లోటు లేదు.. ఆ నీటిలో జరిగే ప్రమాదాలకు కొదువే లేదు. ప్రతి ఏటా 50 మంది వరకూ నదీ ప్రమాదాల్లో మృత్యుపడుతున్నారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నది ఏదైనా పైకి ప్రశాంతంగానే కనిపిస్తుంది.. దిగితేనే దాని లోతు తెలుస్తుంది.. ప్రస్తుత వేసవి నేపథ్యంలో నదీ స్నానాలకు వెళ్లేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.. గోదావరి.. కాలువలు. సముద్రతీర ప్రాంతం ఇలా ఎక్కడపడితే అక్కడ సరదాగా స్నానాలకు క్యూకడుతుంటారు. వేసవి కావడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం పొందడానికి ప్రతి రోజు వేలాది మంది స్నానాలు ఆచరిస్తుంటారు. ఈ సరదాలో ప్రమాదాలను గుర్తించలేక పలువురు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. ఇటీవల శివరాత్రికి తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం తాడిపూడి వద్ద గోదావరిలో స్నానం చేద్దామని వెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాత పడ్డారు. బుధవారమే చూస్తే కాకినాడ జిల్లాలో కాండ్రకోట, పెద్దనాపల్లి వద్ద ఏలేరు కాలువలో స్నానానికి దిగి నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు. వేసవి సెలవుల్లో సరదాకు స్నానాలు సరే కానీ ఆదమరుపుగా ఉన్నామా మిగిలేది మాత్రం కన్నీళ్లే.



ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు : పెద్దనాపల్లిలో మృతదేహాన్ని పట్టుకుని కుటుంబీకుల రోదన

ఈత సరదా..పొంచి ఉన్న ముప్పు

రక్షణ చర్యలు చేపట్టండి

నదీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి. నది లోతు.. జరిగే ప్రమాదం.. తదితర విషయాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలి. కాలువ రేవులు, ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదకరంగా ఉండే గోదావరి ఘాట్ల వద్ద సచివాలయ పోలీసులు నియమించాలి. కాటన్ బ్యారేజీ కిందకు వెళ్లే దారులన్నీ మూసివేయాలి. ప్రధాన కాలువల్లో జరిగిన ప్రమాదాలతో ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. గోదావరి ఘాట్ల వద్ద కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే అప్రమత్తంగా ఉంటారు.

- ప్రమాదకరంగా గోదారి ఘాట్లు
- కాలువలదీ ఇదే పరిస్థితి
- కానరాని కనీస రక్షణ చర్యలు
- వేసవి తాపంతో పెరిగిన తాకిడి
- బుధవారమే నలుగురు మృతి
- అయినా పట్టని అధికారులు
- ఇకనైనా మేల్కొనాల్సిందే



సరదాలు వద్దు నాయనా : అల్లవరం వద్ద సముద్రతీరంలో చిన్నారుల ఈత సరదా

ఈత సరదా.. కాదు!

రాజమహేంద్రవరం సిటీ/కొవ్వూరు/ఆత్రేయపురం: ఉమ్మడి జిల్లాలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం చాలా ఎక్కువ. ఇటు తూర్పుగోదావరి.. అటు కోనసీమ జిల్లా లను ఆనుకుని గోదావరి ప్రవహిస్తుంది. వేసవి వచ్చిందంటే పిల్లలతోపాటు పెద్దలు గోదావరి స్నానాలకు క్యూకడుతుంటారు. కొవ్వూరు, రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ఉంటుంది. ఈ నేపథ్యంలో లోతు ఎక్కువ. కొవ్వూరు గోష్పాదక్షేత్రం.. రాజమహేంద్రవరం పుష్కర ఘాట్, గౌతమి ఘాట్, అయ్యప్ప ఘాట్లు, ధవళేశ్వరం బ్యారేజీ, జొన్నాడ తదితర ప్రాంతాల్లో స్నానాలు ఎక్కువగా చేస్తుంటారు. ఆయా ప్రాంతాల్లో గతంలో ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో ప్రతి ఏటా పర్యాటకులు వేలాదిగా స్నానాలు చేస్తుంటారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలో యువకులు మృత్యువాతపడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలిస్తున్నారు. గతేడాది మే నెలలో ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి ఎందరో చనిపోయారు. ఊబలున్న చోట పైకి గోదావరి చాలా ప్రశాంతంగా కనిపిస్తుంది దిగితేనే దాని లోతు తెలిసేది. పుష్కరాల రేవులో చాలామంది పిల్లలు, పెద్దలు లోతు తెలియక దిగి మృత్యువాతపడిన సందర్భాలున్నాయి. పడవలపై గోదావరి మధ్యలోకి వెళ్లి లంకల్లో దిగి స్నానాలు చేస్తున్నవారున్నారు. అయినా నేటికీ రక్షణ చర్యలు కానరావడం లేదు. రోజురోజుకు సందర్శకులు పెరుగుతున్నా ఏ ఒక్కరూ రక్షణపై దృష్టి సారించడంలేదు.



వేసవి ఉపశమనం..గోదారి : రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద గోదావరిలో స్నానాలు

కన్నీట.. కాలువలు

పిఠాపురం/ ప్రత్తిపాడు/కిర్లంపూడి/ పెద్దాపురం : కాలువలు ప్రమాదకరంగా మారుతున్నాయి.. లోతు తెలియకుండా దిగి ఎంతో మంది మృత్యువాతపడుతున్నారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య గల ఏలేరు, పీబీసీ కాలువలు ఉన్నాయి. వర్షాకాలంలో సుద్దగడ్డ కాలువ ప్రమాదకరంగా ఉంది. ఏలేరు కాలువలో పిడింరొడ్డి, ఎదురొడ్డి, గొల్లప్రోలు కాలువలతోపాటు బల్లకట్టు, భోగాపురం గుమ్మిడిగట్టు రెగ్యులేటర్, గొల్లప్రోలు, చిత్రాడ, నవఖండ్రవాడ, మల్లవరం, యండపల్లి తదితర ప్రాంతాల్లోని పీబీసీ కాలువలు, గొల్లప్రోలు వద్ద సుద్దగడ్డ కాలువ, చెందుర్తి, కొడవలి వద్ద పుష్కర, పోలవరం కాలువల వద్ద పలు ప్రమాదాలు చోటు చేసుకుని గత ఐదేళ్లలో 19 మంది మృత్యువాతపడ్డారు. ఏలేశ్వరం ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏలేరు ఎడమ కాలువ ప్రమాదభరితంగా మారింది. పెదశంకర్లపూడి, రౌతుపాలెం,పెద్దిపాలెం, గజ్జనపూడి, యుజేపురం తదితర చోట్ల స్నానాలకు కాలువలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.పాదురుపాక, గజ్జనపూడి, చింతలూరు పరిసరాల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. కిర్లంపూడి మండలం ముక్కొల్లు,పెద్దాపురం మండలం కాండ్రకోట ఏలేరు బెడ్ రెగ్యులేటర్ల వద్ద ప్రమాదకరంగా ఉంది. రెండు చోట్లా ఇప్పటివరకూ 30 మంది మృత్యువాతపడడమే అందుకు ఉదాహరణ.

ప్రమాదాల తీరం..

అల్లవరం : సముద్ర తీరం చూస్తే ఎవరికి స్నానం చేయాలనిపించదు మరి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, అల్లవరం, అంతర్వేది తదితర ప్రాంతాల్లో సముద్రతీర ప్రాంతాలు ఉన్నాయి. వేసవి కావడంతో కొందరు యువకులు సముద్ర స్నానాలకు దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. అల్లవరం, కాకినాడ సముద్ర తీర ప్రాంతాల్లో పలు ప్రాంతాల నుంచి కుటుంబీకులతో బీచ్‌కు చేరి సముద్ర స్నానాలు ఆచరిస్తున్నారు. ఓడలరేవు తీరంలో మెరైన్ పోలీసులు గస్తీ తిరుగుతున్నా కొందరు యువత వారిని కాదని లోతుకు వెళ్లి మృత్యువాతపడుతున్నారు. తీరాన అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతి.

ఉపాధి హామీ అమలులో జిల్లాకు ప్రథమ స్థానం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రోజువారీ సగటు వేతనంతోపాటు అత్యధిక పనిదినాలు కల్పించడంతో రాష్ట్రంలోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రథమస్థానంలో నిలిచినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి కల్పనతోపాటు గ్రామీణ సుస్థిర ఆస్తుల కల్పన, పర్యావరణ పరిరక్షణ, జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా 22 మండలాల్లోని 385 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేసినట్టు ఆయన తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1.74 లక్షల మంది ఉపాధి కూలీలకు పని కల్పించామన్నారు. జిల్లాకు 57 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 56.80 లక్షల పనిదినాలను కల్పించడంతోపాటు రోజువారీ సగటు వేతనం కింద రూ.291.20 చెల్లించడం ద్వారా జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. వేతన రూపంలో రూ.165.43 కోట్లు చెల్లించగా ఒక్కో కుటుంబానికి రూ.45.85 రోజుల పని కల్పించామన్నారు. 12,045 కుటుంబాలకు వంద రోజులు పూర్తి పనులు కల్పించగా వారిలో 6,013 షెడ్యూల్డు కులాల కుటుంబాలు ఉన్నాయన్నారు. 56 చెరువుల్లో పూడికతీత, పునరుద్ధరణ పనులతో పాటు కాల్వలకు పూడికతీత పనులు చేపట్టడం కొబ్బరి తోటల్లో రింగ్ టెంచస్ పనులు వంటివి చేపట్టారన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 3415 కిలోమీటర్ల మేర కాల్వ పూడికతీత పనులు, 59 చెరువుల్లో పూడికతీత పనులు లక్ష్యంగా నిర్ణయించామని తద్వారా 41 లక్షల పనిదినాలు పొందేందుకు పరిపాలనా ఆమోదం తీసుకోవడం జరిగిందని తెలిపారు.

లైసెన్సులు పొందకపోతే రూ.5 లక్షలు జరిమానా

అమలాపురం టౌన్, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా ఫీడ్ కెమికల్స్ విక్రయించే దుకాణదారులంతా ఏపీ రాష్ట్ర ఆక్వాకల్చర్ అభివృద్ధి చట్టం కింద లైసెన్సులు విధిగా పొందాలని జిల్లా మత్స్యశాఖాధికారి ఎల్‌బీఎస్ వర్ధన్ తెలిపారు. లైసెన్సులు పొందకపోయినా, దరఖాస్తు చేసి ఉండకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల 24న ఆక్వా రంగంలో యాంటీ బయోటిక్ నిషేధంపై ఏర్పడిన జిల్లాస్థాయి కమిటీ సమావేశలో తీసుకున్న నిర్ణయాల మేరకు దుకాణదారులంతా లైసెన్సులు పొంది ఉండాలన్నారు. లేనిపక్షంలో మే 1వ తేదీ నుంచి నిర్వహించే తనిఖీల్లో లైసెన్సులు పొందని దుకాణదారులకు రూ.5 లక్షల జరిమానా విధిస్తామని వర్ధన్ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

కోకో హబ్‌గా కోనసీమ

- జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని పెంచాలి
- కొబ్బరి తోటల్లో అనువైన సాగు కోకో
- జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

అమలాపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దశలవారీగా సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ జిల్లాను కోకో హబ్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉద్యానవన అధికారులను ఆదేశించారు. కోనసీమలో కొబ్బరితోటలు కోకో సాగుకు అంతర పంటగా అనువైన వాతావరణం మెండుగా ఉందన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి కోకో కమిటీ సమావేశం ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, కమిటీ సభ్యులతో నిర్వహించారు. కోకో కాయల కోత అనంతరం ప్రోసెసింగ్ యూనిట్ల స్థాపనకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏక పంటగా కొబ్బరి సాగు విరాజిల్లేదని, ఇరియోఫిడ్ నల్లి తెగులు తాకిడితో కొబ్బరి దిగుబడి తగ్గిపోయిందన్నారు. కొబ్బరిపై ఆధారపడి రైతులు మనుగడ సాగించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ తరుణంలో రైతులను అన్నివిధాలా ఆదుకునే కోకోను అంతర పంటగా పండించాలన్నారు. కోకో నాటిన మూడో ఏడాది నుంచి దిగుబడి వస్తుందని, కానీ కాయల నుంచి తీసిన గింజలను నాణ్యతతో ప్రోసెసింగ్ చేసే విధానంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో గిట్టుబాటు ధరలు పొందలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వెయ్యి ఎకరాలకు ఒక కామన్ పర్మింటేషన్ కేంద్రాన్ని ఎకరం స్థలంలో నెలకొల్పే దిశగా సమగ్ర ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టామన్నారు. గింజల గ్రేడింగ్, బుట్ట పద్ధతి, కృత్రిమంగా ఎండబెట్టడం, నిల్వ చేయడం తదితర అంశాలకు సంబంధించి యూనిట్‌ను నెలకొల్పేందుకు షెడ్ల నిర్మాణం, మానవ వనరుల లభ్యత, వివిధ రకాల పరికరాల ఏర్పాటుపై శాస్త్రవేత్తల సమన్వయంతో సమగ్రమైన ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. దేశీయ అవసరాలకు సరిపడా దిగుబడులు లేనందున ఈ పంటకు మంచి భవిష్యత్తు ఉందని, ఇప్పటికే నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2500 ఎకరాల్లో కోకో పంట ఉందని, దీనిని దశల వారీగా ఏడాదికి వెయ్యి ఎకరాల చొప్పున విస్తీర్ణాన్ని పెంచనున్నామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఉద్యానవన విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత, శాస్త్రవేత్త నవీన్ కుమార్, జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఉద్యాన అధికారులు దిలీప్, చందన పాల్గొన్నారు.



ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే బండారు

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించాలి

అధికారుల సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్.. హాజరైన ఎస్పీ, ఎమ్మెల్యే

ఆత్రేయపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం వాడపల్లి కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ నిషాంతి పాల్గొన్నారు. ఏప్రిల్ 7 నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు సంబంధించి అధికారులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాది జరిగిన ఉత్సవాలను ప్రొమో ద్వారా ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఉత్సవాలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను ఆయనకు వివరించారు. ఏప్రిల్ 8న రథోత్సవం, తీర్థం, స్వామివారి కల్యాణోత్సవాలకు లక్షలాదిమంది భక్తులు తరలిరానున్న దృష్ట్యా ఏర్పాట్లు ఏ స్థాయిలో నిర్వహిస్తున్నారో చర్చించారు. టాయిలెట్లు, భక్తుల స్నానాలు, తాగునీరు, వైద్య శిబిరం, విద్యుత్ తదితర సమస్యలపై శాఖల వారీగా సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. అందరి సమష్టి కృషితో బాధ్యతాయుతంగా ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ పోలీస్ యంత్రాంగం ఉత్సవాల్లో తమవంతు సేవలను అందిస్తుందని చెప్పారు. ఐదు సెక్టార్లుగా విభజించి పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గత ఏడాది లోటుపాట్లను సరిచేసుకుని ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నం కావాలని తద్వారా రోజురోజుకు పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. కల్యాణోత్సవాల అనంతరం మాస్టర్ ప్లాన్ ద్వారా వెంకన్న ఆలయ అభివృద్ధికి బాటలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్‌ఐ ఎస్.రాము, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో రామన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నచ్చిన సమయంలో ఎటువంటి కాలయాపన లేకుండా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ తీసుకువచ్చింది. అమలాపురం నుంచి ప్రయోగాత్మకంగా శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ల స్లాట్ బుకింగ్‌కు చర్యలు తీసుకుంటూ జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. స్థిరాస్తులు, భూముల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయం వద్ద రోజంతా వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ముందస్తుగానే నచ్చిన సమయాన్ని ఎంచుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకునే అవకాశాన్ని స్లాట్ బుకింగ్ విధానం ద్వారా తీసుకువచ్చారు. అమలాపురం కేంద్రంగా చేపట్టిన ఈ విధానంలో స్లాట్ బుకింగ్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడం వీలుపడదని, ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. తొలి విడతలో అమలాపురం కేంద్రంగా ప్రయోగాత్మకంగా చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోను అమలుచేసేవిధంగా చర్యలు తీసుకున్నారు. ప్రధానంగా జిల్లాలో అమలాపురంతోపాటు రావులపాలెం, మండపేట, రాజోలు, ముమ్మిడివరం కార్యాలయాల్లో అత్యధికంగా రోజువారీ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ప్రయోగాత్మకంగా అమలాపురంలో చేపట్టిన శ్లాట్ బుకింగ్ విధానంలో రోజుకు 78 స్లాట్‌లు అందుబాటు ఉంటాయి.

ఫిషరీస్ జేడీగా శ్రీనివాసరావు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫిషరీస్ జేడీగా శ్రీనివాసరావు పీవీ శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఇంతకుముందు ఇక్కడ జేడీ పనిచేసిన ఎన్.శ్రీనివాసరావు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో శ్రీకాకుళం డీడీగా పనిచేస్తున్న పీవీ శ్రీనివాసరావు పదోన్నతిపై జేడీగా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులొచ్చాయి.

వాన



ఆలమూరు మండలం మడికి వద్ద గురువారం మధ్యాహ్నం ఒకసారిగా ఆకాశం మేఘావృతమై భారీగా అకాల వర్షం కురిసింది. అకాల వర్షంతో రైతులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటుకల పరిశ్రమకూ భారీ నష్టం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. - ఆలమూరు


శ్రీరామగిరిలోని యాగ రామాలయం

అదిగో... అదిగో... శ్రీరామగిరి



శ్రీరామగిరి... ఆధ్యాత్మికంగా, చారిత్రాత్మకంగా ఎంతో ప్రసిద్ధి పొందిన ఏకైక దక్షిణముఖ ఆలయమిది. సాక్షాత్తూ రామలక్ష్మణులు ఇక్కడ సంచరించినట్టు రామ కథ చెప్తోంది. పురాణంలో శ్రీరామగిరి అతి ముఖ్యమైన ఘట్టంలో ఒకటిగా ఉంది. రావణుడు సీతమ్మవారిని అపహరించిన క్రమంలో ఆమె జాడ కోసం రామలక్ష్మణులు అడవిబాట పడతారు. ఆ సమయంలో కొన్ని మూగజీవాలు చేసిన సంజ్ఞలతో సీతమ్మవారిని రావణుడు అక్కడి నుంచి దక్షిణ దిశగా అపహరించినట్టు రామలక్ష్మణులకు అర్ధమవుతుంది. దీంతో ఆ దిశగా అన్వేషించిన తర్వాత సీతమ్మ కోసం వెళ్లే ముందు గోదావరి నది ఒడ్డున రామలక్ష్మణులు ఓ ఎత్తైన కొండపై చాతుర్మాస్య దీక్ష చేస్తారు. దీంతో ఆ ప్రాంతం శ్రీరామగిరిగా వినుతికెక్కింది.

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలోనే మాతంగి మహర్షి, ఆయన శిష్యులు, రుషులు శ్రీసీతారామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించినట్టు వాల్మీకి రామాయణంలోని అరణ్యకాండలో పొందుపర్చిన శ్రీరామదివ్య చరిత ద్వారా తెలుస్తోంది. మరెక్కడా లేనంత స్థాయిలో అత్యంత సుందరంగా ఆ విగ్రహాలను తీర్చిదిద్దడంతో శ్రీరామగిరిలో ప్రతిష్ఠించిన రాముడు సుందరరాముడిగా పిలవబడుతుంటాడు. అంతే కాదు రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశంలో ఆలయం నిర్మించినందునే యాగ రామాలయంగా ప్రసిద్ధి పొందింది. ఇంతటి విశిష్టత కలిగి ఉన్న ఈ ఆలయం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ వర రామచంద్రపురం మండలంలో 80 అడుగుల ఎత్తులో ఉన్న కొండపై నిర్మితమైంది. ఇక్కడప్రతిఏటా రాముని కల్యాణాన్ని ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

రాముని వనవాసంలో ముఖ్య భూమికలైన జటాయువు, రేఖపల్లి, ఉష్ణగుండాలు, వాలిసుగ్రీవులు, రామలక్ష్మణుల వృక్షాలు, శ్రీరామపాద ముద్రలు, చుక్కనపల్లి లాంటి చారిత్రక దృశ్యాలను భక్తులు నేటికీ అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు.

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రికి కూతవేటు దూరంలో ఉన్న నేటి ఎటపాకే నాటి జటపాక. సీతారాముడు వనవాసం చేస్తున్న సందర్భంలో జటాయువు రాముని వద్దకు వచ్చి తాను దశరథుని శిష్యుడిగా పరిచయం చేసుకుంటుంది. తదుపరి రామా నీవు ఆశ్రమంలో లేని సమయంలో సీతమ్మ వారికి రక్షణగా ఉంటానని మాటిస్తాడు. ఆ మేరకు మాయాలీలుడైన రావణుడు సీతమ్మవారిని అపహరించుకెళ్తున్న సమయంలో అడ్డుపడి శక్తి వంచన లేకుండా యుద్ధం చేస్తాడు. అయితే అత్యంత బలశాలి అయిన రావణుడి ఖడ్గం ధాటికి జటాయువు రెక్కలు, కాళ్లు తెగిపోతాయి. ఓ రెక్క జటపాకలోను, మరో రెక్క రేక్కపల్లిలోను పడిపోతాయి. చివరకు రెండు కాళ్లూ తెగిపోయిన జటాయువు యుద్ధంలో అలసిపోయి రాముడిని స్మరిస్తూ నేలకూలుతుంది. జటపాక నేడు ఎటపాకగా, రెక్కపల్లి వర రామచంద్రపురం మండలంలోని రేఖపల్లిగాను, చొక్కిపోయి నేలకూలిన ప్రదేశం చొక్కనపల్లిగా పిలవబడుతున్నాయి.

రావణుడి అకృత్యాన్ని రాముడికి చెప్తూ జటాయువు తుది శ్వాస విడుస్తాడు. దీంతో జటాయువు అంత్య సంస్కారాలు చేయడం రామలక్ష్మణులు తమ విధిగా భావిస్తారు. ఈ క్రమంలో లక్ష్మణుడు గోదావరి ఒడ్డున చితి పేర్చగా రాముడు చితికి నిప్పు అంటిస్తాడు. దశరథుడు సైతం పొందని ఘన మైన రామునిచేత అంతిమ సంస్కారాలు పొందిన పుణ్యాత్ముడిగా జటాయువు నిలిచాడు. రాముడు చితికి నిప్పు అంటించిన ప్రదేశంలో (గోదావరి ఒడ్డున) రాళ్లపై రామపాద ముద్రలు నేటికీ కనిపిస్తాయి.


ఎటపాకలోని జటాయువు మందిరం

భారతదేశంలోనే ఏకైక దక్షిణ ముఖ ఆలయం

సాక్షాత్తూ రామలక్ష్మణులు యాగం చేసిన ప్రదేశమిది

ఉష్ణగుండాలు, ఎటపాక, రేఖపల్లి

రామాయణ ఇతివృత్తంతో ముడిపడి

ఉన్న ఆధ్యాత్మిక ప్రదేశాలివి






తమ ప్రాంతంలో సంచరించిన రామలక్ష్మణులకు గుర్తుగా ఆదివాసీలు వరరామచంద్రపురం మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో రామ, లక్ష్మణుల పేరిట రెండు టేకు చెట్లు నాటినట్టు చరిత్ర చెప్తోంది. ఏపుగా పెరిగి వున్న అవి నేటికీ మనకు కనిపిస్తాయి.

ఎటపాక మండలం గుండాల సమీపాన గోదావరి తిన్నెలో ఉష్ణ గుండం నేటికీ మనకు కనిపిస్తుంది. ఆ గుండం నుంచి ఎప్పుడూ వేడి నీరే వస్తుంది. సీతమ్మ వన వాస సమయంలో శీతాకాలం రావడంతో గోదావరి నీరు చల్లగా ఉండి స్నానమాచరించేందుకు ఆమె ఇబ్బంది పడడాన్ని లక్ష్మణుడు గుర్తించి గోదావరి ఇసుక తిన్నెలోకి బాణాన్ని సంధిస్తాడు. ఆ ప్రదేశంలో ఏర్పడిన గుండం నుంచి వేడినీరు వచ్చినట్టు ప్రతీతి. ఇప్పటికీ ఆ ప్రదేశాన్ని స్థానికులు భక్తుల సందర్శనార్థం ముక్కోటి, శ్రీరామనవమి పర్వదినాల్లో అందుబాటులోకి తెస్తున్నారు.





అన్నదమ్ములైన వాలి, సుగ్రీవులు రామాలయానికి కూతవేటు దూరంలో ఉన్న తూర్పు కనుమల్లో తల దాచుకోవ డంతో అక్కడున్న కొండలను వాలిసుగ్రీవులు కొండలుగా పిలుచుకుంటారు.


వర రామచంద్రపురం మండలంలో గోదావరి ఒడ్డున ఉన్న శ్రీరామగిరి గ్రామం





శిశిరం... నవ వసంతం

ఆకురాలు కాలం (శిశిరం) వెళ్లింది.. చిగురించే కాలం (వసంతం) వచ్చింది... నవ వసంతంలో చెట్లు శోభను సంతరించుకున్నాయి.. కాకినాడ పిండాల చెరువు వద్ద కొద్ది రోజుల క్రితం ఆకులన్నీ రాలి కళావిహీనంగా కనిపించిన రావి చెట్టు నేడు కళకళలాడుతూ కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ


కాకినాడ బీచ్ రోడ్డులో గో కార్టింగ్ రేస్ ట్రాక్

గో... గో... రయ్... రయ్...

కాకినాడ సాగర తీరంలో గోకార్ట్ రేసింగ్

సిద్ధమవుతున్న ట్రాక్

ఈ నెలలోనే అందుబాటులోకి...

కాకినాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

కాకినాడ సాగర తీరం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడికి వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడిపేలా పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ వినోదాన్ని పంచేలా ఎమ్యూజ్‌మెంట్ పార్కును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. పర్యాటకులకు ఆటవిడుపుగా ఉండేలా.. రాష్ట్ర పర్యాటక శాఖ, స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. తాజాగా కాకినాడ, పరిసర ప్రాంతవాసులకు గోకార్ట్ కార్ రేసింగ్ అందుబాటులోకి రానుంది. కాకినాడ బీచ్‌కు దగ్గరలో సుమారు ఐదున్నర ఎకరాల్లో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ పనులు పూర్తి కావొస్తున్నాయి.



గో కార్టింగ్‌తో పాటు 46 ఎమ్యూజ్‌మెంట్ యాక్టివిటీస్ వస్తున్నాయి. అందులో హ్యూమన్ గైరో, క్రికెట్, 50 ఫీట్ జెయింట్ స్వింగ్, వీఆర్ గేమ్స్, గో కార్టింగ్‌లో అత్యంత అధునాతన వాహనాలను తీసుకొస్తున్నారు. అన్ని రకాల ఫుడ్ కౌంటర్స్, మెకనైజ్డ్ క్రికెట్, పెయింట్ బాల్, ఆర్చరీ, రైఫిల్ షూటింగ్ వంటి క్రీడలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. పర్యాటకులకు ఎంట్రీ ఫ్రీ అని, రూ.300తో గోకార్టింగ్ యాక్టివిటీ మొదలవుతుందని గోకార్టింగ్ ఏరియా మేనేజర్ శ్రావణ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


జోరుగా నిర్మాణ పనులు

నేడు అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శన


పోలీసులకు సూచనలిస్తున్న సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

- కూటమి ప్రభుత్వంతో సంస్కృతీ, కళలకు పునరుజ్జీవం
- ప్రదర్శనల రాబడితో దామెర్ల ఆర్ట్ గ్యాలరీ అభివృద్ధి
- 500కిపైగా కళాకారుల నమోదు
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలి
- రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి

రాజమహేంద్రవరం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): కళలకు కాణాచి వంటి రాజమహేంద్రవరంలో అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు సెంట్రల్ జైలు రోడ్డులో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని.. ప్రజలు పెద్దసంఖ్యలో వచ్చి తిలకించాలని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి అన్నారు. గురువారం ఆమె ఏర్పాట్లను పరిశీలించి పోలీసు తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సంస్కృతి, కళలకు పునరుజ్జీవం వచ్చిందన్నారు. వాటికి పూర్వవైభవం తీసుకురావాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. సెంట్రల్‌జైలురోడ్డులో శుక్రవారం నిర్వహించనున్న అమరావతి చిత్రకళా వీధి ప్రదర్శనకు 500మంది కళాకారులు నమోదు చేసుకున్నారన్నారు. వారి చిత్రకళలు ప్రదర్శనలో ఉంటాయన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలనుంచి కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చే నిధులతో రాజమహేంద్రవరంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీని అభివృద్ధి చేస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళలు, సంప్రదాయాలకు ఆదరణ లభించలేదని, వాటి పునరుద్ధరణకు ఏ ప్రయత్నమూ జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు. ఎంతో గొప్ప కళాకారులు, పద్మ అవార్డుల వంటి ఉన్నత పురస్కారాల గ్రహీతలకు సైతం అప్పట్లో సముచిత గౌరవం దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కమిషన్ డైరెక్టర్ అండ్ సీఈవో మల్లి ఖార్జు నరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, పాల్గొన్నారు.

చిత్ర కళా ప్రదర్శన ప్రదేశం

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలురోడ్డులో సెంట్రల్ జైలు నుంచి ఆర్ట్స్ కళాశాల వరకూ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో.

సమయం: ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు. ప్రవేశం ఉచితం.

ట్రాఫిక్ ఆంక్షలు

రాజమహేంద్రవరం వై.జంక్షన్ నుంచి సీటీఆర్ఐ జంక్షన్ వరకూ సెంట్రల్‌జైలు రోడ్డులో లాలాచెరువు వైపునుంచి వచ్చే కార్లు, బస్సులు, ఇతరవాహనాలు క్వారీ మార్కెట్, మార్కెట్‌యార్డు రోడ్డు, కంబాల చెరువు గుండా ఆర్ట్స్ కళాశాల చేరుకుని పార్క్ చేసుకోవాలి. ద్విచక్ర వాహనాలు సీటీఆర్ఐ వరకూ రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్‌కి అడ్డం లేకుండా నిలపవచ్చు. కంబాలచెరువునుంచి లాలాచెరువు వెళ్లే వాహనాలు మార్కెట్ యార్డు రోడ్డులో క్వారీ మార్కెట్ సెంటర్‌కి వెళ్లి అక్కడినుంచి లాలాచెరువు చేరుకోవాలి. శుక్రవారం రాత్రి 10గంటల వరకూ ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

వసూళ్లు అంతంతే!



లక్ష్యానికి ఎంతో దూరంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పన్ను వసూళ్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

పన్నుల వసూలే లక్ష్యంగా కొన్ని నెలలుగా శ్రమిస్తున్న మున్సిపల్ అధికారులు ఆ లక్ష్యానికి చేరువయ్యారా? మొండి బకాయిలను వసూలు చేయగలిగారా? మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఈ సందర్భంగా అనుకున్న టార్గెట్‌ను పూర్తి చేశారా? మున్సిపాలిటీలకు గుదిబండగా మారిన బకాయిల భారాన్ని కాస్తయినా 2024-25 ఆర్థిక సంవత్సరంలో దించుకోగలిగారా? అంటే లేదు అనే సమాధానమే వినిపిస్తోంది. పన్నుల వసూలులో కొన్ని మున్సిపాలిటీల్లో వెనుకబడ్డారని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని కీలకమైన కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో 50శాతం మేర మాత్రమే వసూళ్లు చేయడమే నిదర్శనం.

కాకినాడ జిల్లాలో...

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన గడువు తీరింది. అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో కాకినాడ జిల్లాలోని పలు మునిసిపాలిటీలు వెనుకబడ్డాయి. ప్రభుత్వం 50శాతం వడ్డీ మాఫీ కల్పించినా ప్రజల నుంచి అంతంతమాత్రమే స్పందన రాగా, కొన్ని మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితం లభించింది. కాకినాడ నగరపాలక సంస్థలో కొన్ని చోట్ల కుళాయిల కనెక్షన్లు కట్ చేసినా.. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లో దుకాణాలను సీజ్ చేసినా 50 శాతంలోపు మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారు. కాకినాడ జిల్లాలో కాకినాడ నగరపాలక సంస్థ, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలతో పాటు ఏలేశ్వరం, గొల్లప్రోలు వంటి రెండు మేజర్ నగర పంచాయతీలు కూడా ఉన్నాయి. వీటిలో గొల్లప్రోలు నగర పంచాయతీ 76.71శాతం, పెద్దాపురం 65.81శాతంతో లక్ష్యానికి కాస్త చేరువయ్యాయి. కొన్ని మున్సిపాలిటీల్లో వసూళ్లశాతం తక్కువగా ఉండడానికి దీర్ఘకాలంగా ఉన్న కోర్టు కేసులు కూడా మరో కారణం. మొండిబకాయిదారుల ముక్కుపిండి వసూలు చేస్తామని చెప్పిన నగరపాలక రెవెన్యూ అధికారులు.. వెనుకబడ్డారు. సెలవు దినాల్లో సైతం పన్ను చెల్లింపు కౌంటర్లు తెరిచినా.. 50 శాతానికి చేరువకాలేకపోయారు. కాకినాడ నగరపాలక సంస్థను పరిశీలిస్తే.. ఇక్కడ పన్ను వసూలు లక్ష్యం రూ.110.99 కోట్లు. అందులో పాతబకాయిలు రూ.56.42 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత బకాయిలు రూ.54.58కోట్లు.. ఇప్పటివరకు రూ.52.97కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.58.02 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 47.72 శాతం మాత్రమే వసూలైంది. కనీసం 50 శాతానికి కూడా చేరువకాలేకపోయింది. ఇక్కడ పన్నుల వసూలుపై నగరపాలక అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్‌కు పన్ను వసూలు బాధ్యత అప్పగించిన కమిషనర్ భావన ప్రతి శనివారం పన్ను వసూళ్ల ప్రగతిపై సమీక్షించేవారు. అంతేకాదు.. పన్ను వసూలుపై పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేపట్టారు. నగరంలో 200కిపైగా కుళాయి కనెక్షన్లను తొలగించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని 11కిపైగా దుకాణాలను సీజ్ చేశారు. పన్నులు చెల్లించని ఖాళీస్థలాల వద్ద జప్తు చేస్తామంటూ హెచ్చరిక బ్యానర్లు తగిలించారు. ఆటోల్లో ప్రచారం, ఐవీఆర్ఎస్ ద్వారా ఇంటి యజమానుల మొబైల్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం మున్సిపాలిటీలో మొత్తం పాత బకాయిలు రూ.5.58 కోట్లు, ప్రస్తుత బకాయిలు రూ.4.59కోట్లు కలిపి మొత్తం పన్ను బకాయిలు రూ.10.17కోట్లు కాగా, అందులో రూ.4.97కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ.5.20 కోట్లు వసూలు కావాల్సి ఉంది. అంటే 48.90శాతమే ఈ మున్సిపాలిటీలో పన్నులు వసూలయ్యాయి. గొల్లప్రోలు నగర పంచాయతీలో పన్ను వసూల లక్ష్యం రూ.1.82 కోట్లు కాగా రూ.1.39కోట్లు వసూలైంది. 76.71 వసూలు శాతం నమోదైంది. కాకినాడ జిల్లాలో ఈ నగర పంచాయతీయే పన్నుల వసూలులో ముందంజలో ఉంది. సామర్లకోట మున్సిపాలిటీలో పన్నుల వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు రూ.8.78 కోట్లు కాగా అందులో రూ.4.47కోట్లు వసూలైంది. ఇంకా రూ.4.31 కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ 50.93శాతం పన్నులు వసూలయ్యాయి. పెద్దాపురం మున్సిపాలిటీలో పన్ను వసూలు లక్ష్యం పాత, ప్రస్తుత బకాయిలు కలిపి రూ.7.18కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. రూ.2.45కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 65.81 శాతంగా నమోదైంది. ఏలేశ్వరం నగర పంచాయతీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.2.61కోట్లు కాగా అందులో రూ.1.49కోట్లు వసూలయ్యాయి. రూ.1.12కోట్ల బకాయిలున్నాయి. ఇక్కడ పన్ను వసూలు శాతం 57.12. ఇక తుని మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు మొత్తం రూ.7.28 కోట్లుకాగా, రూ.5.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.2.19కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 69.92 శాతం పన్ను వసూలైంది.

తూర్పుగోదావరి జిల్లాలో...

తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి పాత, ప్రస్తుత పన్ను బకాయిలు రూ.132.32 కోట్లు కాగా రూ.71.09 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.61.22 కోట్లు వసూలు కావాల్సి ఉంది. 53.73 శాతం పన్ను వసూలు నమోదైంది. కొవ్వూరు మున్సిపాల్టీ మొత్తం పన్నుబకాయిలు రూ.4.56 కోట్లు కాగా రూ.3.69కోట్లు వసూలయ్యాయి. రూ.0.86కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 81.04 శాతం వసూలైంది. నిడదవోలు మున్సిపాల్టీకి సంబంధించి మొత్తం పన్ను బకాయిలు రూ.8.47కోట్లు కాగా రూ.4.72కోట్లు వసూలైంది. ఇంకా రూ.3.75 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ 55.72 శాతం వసూలైంది.

కోనసీమ జిల్లాలో...

అమలాపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత ఆస్తి పన్ను బకాయిలు రూ.14.72కోట్లు కాగా.. రూ.9.01కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ.5.71 కోట్ల మేర బకాయిలున్నాయి. ఇక్కడ 61.94 శాతం పన్ను వసూలయ్యాయి. రామచంద్రపురం మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ.7.65 కోట్లు కాగా వసూలైంది రూ.4.93కోట్లు, వసూలు కావాల్సింది రూ.2.72 కోట్లు ఇక్కడ పన్ను వసూలు శాతం 64.46. మండపేట మున్సిపాలిటీలో పాత, ప్రస్తుత బకాయిలు రూ. 8.37 కోట్లు కాగా వసూలైంది రూ.6.42, వసూలు కావల్సింది రూ.1.95 కోట్లు, ఇక్కడ పన్నువసూలు శాతం 76.73 శాతం. ముమ్మిడివరం నగర పంచాయతీలో పన్ను వసూలు లక్ష్యం రూ.1.81కోట్లు కాగా రూ.1.37 కోట్లు వసూలైంది. రూ.0.45 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఇక్కడ పన్ను వసూలు శాతం 75.42 శాతం.


మండపేట మున్సిపాలిటీ

రాష్ట్రంలో కొవ్వూరుకు ఆరు.. మండపేటకు పదో స్థానం

మండపేట, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుల వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కొవ్వూరు మున్సిపాలిటీకి ఆరో స్థానం లభించింది. ఇక్కడ 81.04 శాతం సాధించి రికార్డు సృష్టించింది. మొత్తం రూ.4.56 కోట్ల లక్ష్యానికిగాను రూ.3.69 కోట్లు వసూలయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటలో ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి రాష్ట్రంలో పదో స్థానాన్ని పొందింది. ఇక్కడ 76.73 శాతం సాధించింది. మొత్తం రూ.8.37 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యంకాగా రూ.6.42 శాతం వసూలైంది. కోనసీమ జిల్లాలో మండపేటకు పన్నుల వసూళ్లలో ప్రథమ స్థానం లభించిందని మున్సిపల్‌కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు.

కర్పూర ధర అధరహో

● గరిష్ఠంగా రూ.500 పైమాటే

● ఎగుమతులు పెరిగాయి..

దిగుమతులు తగ్గాయి



రావులపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలో మెట్ట రైతులు అరటిసాగులో కర్పూర రకం అరటిని ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఈ రకం అరటిగెలలు ఎగుమతులు అవుతుంటాయి. అక్కడి వ్యాపారులు గెలల కొనుగోలు కోసం వచ్చిన సమయంలో రైతులకు ధరలు అనుకూలంగా ఉంటాయి. రెండు నెలల క్రితం అరటి ధరలు బాగా పతనం కావడంతో రైతులు దిగాలు పడ్డారు. కాగా మార్చి మొదటివారం నుంచి కర్పూర రకం అరటికి డిమాండ్ పెరిగింది. అమ్మవారి జాతర్లు, తీర్థాలు, శుభ ముహూర్తాలు, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు ఉండటంతో రోజురోజుకీ ధర పెరిగి రైతులకు ఊరట కలిగించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రావులపాలెం అరటి మార్కెట్ యార్డుకు రైతులు సైకిళ్లు, మోటార్‌సైకిళ్లపై అరటి గెలలను తీసుకువచ్చి విక్రయిస్తారు. జనవరి నుంచి మొదలుకుని మార్చి మొదటి వారం వరకూ కర్పూర రకం అరటి గెల రూ.200 నుంచి రూ.250 వరకూ మాత్రమే పలకడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. కాగా మార్చి మొదటి వారం నుంచి గరిష్ఠంగా కర్పూర రకం అరటి గెల రూ.500 పలుకుతుండటంతో రైతులు ఊరట చెందుతున్నారు. దిగుబడి పుష్కలంగా ఉన్న సమయంలో ధర లేదు.. దిగుబడి తగ్గిన సమయంలో ధర పలుకుతుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక అరటి మార్కెట్ యార్డు నుంచి ఒడిషా, భువనేశ్వర్, కటక్, విశాఖపట్నం, తెలంగాణాతో పాటు పలు ప్రాంతాలకు నిత్యం 10వేల కర్పూర రకం అరటి గెలలు ఎగుమతి అవుతున్నాయి.

గోలి శ్యామలకు కలెక్టర్ అభినందన



శ్యామలను అభినంధిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గోలి శ్యామల జనవరి నెలలో విశాఖపట్నం నుంచి సముద్రంలో ఈదుతూ కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు విజయవంతంగా చేరారు. ఆమె సాహసాన్ని అభినందిస్తూ ఓల్డ్ ఓపెన్ వాటర్ అసోసియేషన్ ప్రశంసాపత్రం అందజేసింది. ఈ నేపథ్యంలో శ్యామల గురువారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 150 కిలోమీటర్లు సముద్రంలో ఈదుతూ గమ్యాన్ని చేరుకోవడం గొప్ప విశేషమని కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

రూ.171.33కోట్లతో

సత్యదేవుడి ఆలయ బడ్జెట్



● రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు పింఛన్లు, ఇతర ఉద్యోగుల జీతాలకు రూ.46.25కోట్లు

● ప్రసాదం తయారీ ముడిసరుకులకు రూ.25కోట్లు ● ఉత్సవాలకు రూ.1.57కోట్లు

● ప్రసాదం ప్యాకర్లు, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణుల రెమ్యునరేషన్‌కు రూ.19.70 కోట్లు

● భక్తుల సౌకర్యాలకు రూ.7.64కోట్లు ● ప్రభుత్వానికి వివిధ చెల్లింపుల ఖర్చు రూ.23.30కోట్లు

● ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.171.33కోట్లతో ఆలయ బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతూ దేవదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బడ్జెట్‌కు అనుగుణంగానే వ్యయం చేయాల్సి ఉంటుంది. వీటిలో 3వ వంతు రూ.46.25కోట్లు రెగ్యులర్ ఉద్యోగుల జీతాలు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల పింఛన్లు, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల చెల్లింపులకు కేటాయించారు. రెమ్యునరేషన్ పద్ధతిపై పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు, వ్రతపురోహితులు, ప్రసాదం ప్యాకర్లకు రూ.19.70కోట్లు చెల్లింపునకు ఆమోదం లభించింది. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షిణ తదితర ఉత్సవాల నిర్వహణకు ఈఏడాదిలో రూ.1.57కోట్ల వరకు ఖర్చుచేసుకునే వీలు కల్పించారు. భక్తులకు సౌకర్యాలు కల్పించే శానిటేషన్ నిర్వహణ, హౌస్‌కీపింగ్, చలువపందిళ్ల ఏర్పాటు, తదితర వాటికి రూ.7.64కోట్లు మంజూరయ్యాయి. రూ.1.63 కోట్లు విద్యుత్‌బిల్లుల చెల్లింపు, నిర్వహణ, ఎలక్ట్రికల్ గూడ్స్ కొనుగోలు, నీటిసరఫరాకు రూ.1.63 కోట్లు కేటాయింపులు జరిగాయి. ట్రాన్స్‌పోర్టు నిర్వహణకు రూ.1.16కోట్లు, రూ.5.03కోట్లతో దత్త ఆలయాలు, విద్యాసంస్థల నిర్వహణ, వేదపాఠశాల, వైద్య సదుపాయాలకు వెచ్చించాలని స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూ.5.35కోట్లు ఆలయ భద్రతకు విధులు నిర్వహించే హోంగార్డులు, ఎస్పీఎఫ్ సిబ్బంది, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుకు చెల్లించనున్నారు. రూ.23.30 కోట్లను సీజీఎఫ్, ఆడిట్ ఫీజు ఇతర పన్నుల రూపంలో ప్రభుత్వానికి చెల్లించేందుకు కేటాయించారు. భక్తుల సౌకర్యాలకోసం వివిధ నిర్మాణాలకు రూ.4కోట్లు, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్ కోసం రూ.5కోట్లు కేటాయించారు. రూ.6.43కోట్లను అన్నదాన విభాగం నిమిత్తం మంజూరయ్యాయి. వీటితో ప్రావిజన్స్, కూరగాయల కొనుగోలు, అన్నదాన విభాగ సిబ్బంది జీతాలకు ఆమోదం లభించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఆదాయానికి వ్యయానికి సరిచూసుకుని రూ.3కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా చేయాలని సూచించారు.



రాములోరి కల్యాణానికి శాస్త్రోక్తంగా పందిరరాట వేస్తున్న పండితులు, పాల్గొన్న ఈవో

రత్నగిరి రామయ్య కల్యాణానికి పందిరిరాట

సత్యదేవుడి ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల కల్యాణానికి ప్రారంభ సూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు అర్చకస్వాముల మంత్రోచ్చారణల నడుమ పందిరిరాటను నెలకొల్పారు. ఈనెల 5 నుంచి శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. 6వ తేదీ మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో సీతమ్మ మెడలో రామయ్య మూడుముళ్లు వేయనున్నారు. వేడుకలు 13వ తేదీతో ముగుస్తాయి. పందిరరాట కార్యక్రమం లో ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పాల్గొన్నారు.

మనస్తాపంతో ఉరి వేసుకుని వ్యక్తి మృతి



రొక్కాల మోజెష్(ఫైల్)

అంబాజీపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య ఏర్పడిన మనస్పర్థలతో భర్త మనస్తాపం చెంది ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం పరిధిలోని లీజర్‌కాలనీకి చెందిన రొక్కాల మోజెస్ (34)కు తన భార్యతో వారంరోజుల క్రితం మనస్పర్థలు ఏర్పడ్డాయి. మోజెష్ భార్య వారంరోజుల క్రితం తన పాపను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటినుంచి మోజెష్ ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. తన ఏడాదిన్నర కుమార్తెకు ఐ మిస్‌యూ బంగారు తల్లి అని స్టేటస్ పెట్టుకున్నాడు. అనంతరం తన బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మోజెష్ మృతి చెందాడు. మోజెష్ ఇంకా నిద్రలేవలేదని స్థానికులు కిటికీలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని స్థానికులు గమనించారు. దీంతో తలుపులు పగులగొట్టి చూసేసరికి అప్పటికే మోజెష్ మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.చిరంజీవి తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

గోపాలపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని మహిళ మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం మండలంలోని సంజీవపురం గ్రామ పంచాయతీ పరిధిలోని నందిగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చేటుచేసుకుంది. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కొంతమంది కూలీలను నంది గూడెం గ్రామశివారులో ఉన్న కాకర్ల దివాకర్, సంజీవ్ కుమార్‌లకు చెందిన కోళ్లఫామ్‌లో కూలిపని చేసేందుకు పెట్టుకున్నారని అన్నారు. గత సంవత్సర కాలంగా వాళ్లు అదే కోళ్లఫామ్‌లో పనిచేస్తున్నారని, అదే క్రమంలో సతామి కోటల్ (30) భర్త సునీల్ కోటల్ ఇరువురు పనిచేసే క్రమంలో ఈనెల జీతాన్ని సునీల్‌కోటల్ మొదటి భార్యకు రూ.5వేలు వేయడంతో మనస్తాపానికి గురైన సతామికోటల్ తాము నివాసం ఉంటున్న గదికి గెడ వేసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. దీంతో తోటి కూలీలు తలుపులు పగులగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న సతామికోటల్‌ను కిందకు దింపి చూడగా అప్పటికే ఆమె చనిపోయిందన్నారు. కోళ్లఫామ్ యజమాని ఇచ్చిన సమాచారం మేరకు నందిగూడెం వీఆర్వో కొత్తపల్లి రాంబాబు పిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పి.గన్నవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం మండలానికి చెందిన బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.... మండలంలోని ఓ గ్రా మానికి చెందిన 15 ఏళ్ల బాలిక ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసింది. అయితే బుధవారం మధ్యాహ్నం టీవీ చూడటానికి వెళ్తున్నానని తల్లికి చెప్పి పక్క నివాసానికి వెళ్లింది. ఎంతసేపటికీ రాకపోవడంతో చుట్టుపక్కలా, బ ంధువులు ఇళ్లవద్ద వాకబుచేసి ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలుడి అదృశ్యం..



పాలూరి వెంకట ఫణీంద్ర (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... కాకరాపల్లి గ్రామానికి చెందిన పాలూరు బెన్నేష్ కుమారుడు వెంకట ఫణీంద్ర రాత్రి 7-30 నిమిషాలకు బహిర్భూమికి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా తిరిగి రాకపోవడంతో ఈరోజు ఉదయం తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసునమోదు చేసినట్టు తెలిపారు.

యువతి అదృశ్యం...



షేక్ నాగీనా (ఫైల్)

కోటనందూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కాకరపల్లికి చెందిన యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం... షేక్ మీరాబికి చెందిన కూతురు షేక్ నాగీనా బుధవారం సాయంత్రం 6.30కు చెవిరింగులు కొనడానికి కోటనందూరు సెంటర్‌కి వెళుతున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. సెంటర్‌లో వెతికినప్పటికీ కనబడకపోవడంతో తల్లిదండ్రులు ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ

కాకినాడరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియార్టీ జాబితాను www.deoe g.org వెబ్‌సైట్, నోటీస్ బోర్డులలో ఉంచామని డీఈవో పి.రమేష్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలుంటే ఈనెల 4నుంచి 11వ తేదీ సాయంత్రంలోపు సరైన ఆధారాలతో విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వాడపల్లిలో బెల్లపు బట్టీలలో విజిలెన్స్ తనిఖీలు

● రూ. 38 లక్షల విలువైన పంచదార, బెల్లం, రసాయనాలు స్వాధీనం



వాడపల్లిలో బెల్లపు బట్టీలలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి, బంగారంపేట గ్రామాలలో బెల్లపు బట్టీలపై విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. బెల్లపు బట్టీలలో కల్తీ జరుగుతుందని రీజనల్ విజిలెన్స్ అధికారి ఎన్.స్నేహితకు వచ్చిన సమాచారం మేరకు డీఎస్పీ టి.తాతారావు పర్యవేక్షణలో రెండు బృందాలుగా విజిలెన్స్ అధికారులు కొవ్వూరు మండలంలోని బెల్లపు బట్టీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో నాణ్య తా ప్రమాణాలు పాటించకుండా నిషేదిత రం గులు, రసాయణాలు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. రూ.38లక్షల విలువైన పంచదార, బెల్లం స్వాధీనం చేసుకున్నారు. వాడపల్లిలో 36,500 కేజీల పంచదార, 2324 కేజీల నాసిరకం బెల్లం, బంగారంపేటలో 2800 కేజీల పంచదార, 486 కేజీల నాసిరకం బెల్లంతోపాటు బెల్లం తయారీలో ఉపయోగించే నిషేదిత రంగులు, ఇతర రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్లపు తయారీ కోసం పొయ్యిలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసి తగులబెడుతున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న బెల్లాన్ని, పంచదారను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నామన్నారు. ల్యాబ్ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ మధుబాబు మాట్లాడుతూ కొవ్వూరు పరిసర ప్రాంతాలలో బెల్లంతయారీలో కల్తీ జరుగుతుందని విజిలెన్స్ రీజనల్ అధికారి ఎన్.స్నేహితకు సమాచారం వచ్చిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు వాడపలిల్లో బండి శ్రీనివాసరావు బెల్లపు బట్టీ, బంగారంపేటలో ఆనందరావు తనిఖీలు చేపట్టారన్నారు. ఏవిధమైన అనుమతులు లేకుండా బంగారంపేటలో నిర్వహిస్తున్న బెల్లపు బట్టీపై విజిలెన్స్ ఏజి లక్ష్మీనారాయణ, ఫుడ్ రెండవ బృందం వాడపల్లి ఆనందరావు బెల్లపు బట్టీలో గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ సీఐ మధుబాబు, టి.నాగ వెంకటరాజు, ఫుడ్ సేఫ్టీ అధికారి రుత్తయ్య లీగల్ మెట్రాలజీ అధికారి ప్రసాద్, కార్మిక శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు. స్వాధీనం చేసుకున్న బ్లెలం, పంచదారను రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

● 16 కిలోలు స్వాధీనం



గంజాయితో పాటు నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ధవళేశ్వరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టుచేసి అతడి నుంచి 16కిలోల గంజా యిని స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. హర్యాణా రాష్ట్రం పరితాబాద్ జిల్లాకు చెందిన జగదీష్ వైజాగ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలుచేసి హర్యాణా రాష్ట్రానికి తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు సీఐ టి.గణేష్ సిబ్బందితో దాడిచేసి జగదీష్‌ను అరెస్టుచేసి అతడి నుంచి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. కోర్టుకు తరలించగా రిమాండ్ విధించింది. ఈకేసులో నిందితుడిని అరెస్ట్‌చేసిన సీఐ గణేష్, సిబ్బందిని ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన ధ్యానం లారీ

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం నుంచి కె.గంగవరంనకు ఏటిగట్టు మీదుగా ధాన్యంలోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి కపిలేశ్వరపురం పుష్కరరేవు వద్ద ఏటిగట్టును ఆనుకుని ఉన్న హోటల్‌లోకి దూసుకువెళ్లింది. హోటల్ నిర్వాహకుడు మోటుపల్లి వెంకటరమణ హోటల్‌లోకి బుధవారంరాత్రి సుమారు ఒంటిగంట ప్రాం తంలో లారీ దూసుకుపోవడంతో షెడ్డుతోపాటు వంట సామగ్రి పూర్తిగా దెబ్బతింది. రాత్రి సమయంలో హోటల్‌లో నిర్వాహకులు అక్కడలేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. హోటల్ నిర్వహించే పగలు సమయంలో ఇది జరిగి ఉంటే భారీ నష్టం జరిగేదని పలువురు తెలిపారు. బ్రేకుపడకపోవడంవల్ల అదుపుతప్పి హోటల్‌లోకి లారీ దూసుకుపోయి నట్లు డ్రైవరు సతీష్ తెలిపాడు. దీనిపై కేసు నమోదు కాలేదు.



:కపిలేశ్వరపురంలో హోటల్‌లోకి దూసుకెళ్లిన ధాన్యంలోడు లారీ

నాలుగు ఎక్స్‌కవేటర్లు సీజ్

● జిల్లా మైన్స్ అధికారి భూషణ్‌రెడ్డి

దివాన్‌చెరువు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం కొత్తతుంగపాడులో సర్వేనెం 792లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేస్తున్న ప్రదేశాన్ని జిల్లా గనులు, భూగర్భశాఖ, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ చేశారు. తవ్వకాలు చేస్తున్న 4 ఎక్స్‌కవేటర్లను సీజ్ చేశామని జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తవ్వకాలు జరిపిన భూమి వివరాలను పూర్తిగా విచారించిన తర్వాత తవ్వకాలు జరిపిన వారిపై తనిఖీ చేసే అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.

తల్లి, చెల్లిపై దాడి ఘటనలో..

అన్న, వదినపై కేసు నమోదు

కొవ్వూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిని, చెల్లిని కొట్టి గాయపర్చిన అన్న, వదినపై కేసు నమోదు చేసినట్టు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ వి.లలిత తెలిపారు. పట్టణంలోని అచ్చయమ్మకాలనీకి చెందిన మిండల లక్ష్మీ తల్లికి రూ.50వేలు అందా యని తెలుసుకున్న అన్న గంగరాజు, అతని భార్య ముత్తమ్మ ఇంటికి వచ్చారు. గంగరాజు తల్లిని రూ. 50 వేలు కావాలని అడిగాడు, దీంతో ఆమె నిరాకరించడంతో తల్లిని, చెల్లిని గంగరాజు, ముత్తమ్మ ఇటుకరాయితో కొట్టి గాయపర్చారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. మిండల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ లలిత తెలిపారు.

పిల్లలను దృఢంగా ఉండేలా సన్నద్ధం చేయాలి

● ప్రవేశ పరీక్షలపై 'తిరుమల'లో జరిగిన అవగాహన సదస్సులో తిరుమలరావు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన లభించిందని విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు విద్యార్థులు, తల్లిదండ్రులు సుమారు 18 వేల మంది హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను మానసికంగా కాకుం డా, శారీరకంగా, ధృడంగా ఉండేలా సన్నద్ధం చేయాలని అప్పుడే వారి పిల్లలు వృద్ధిలోకి వస్తారన్నారు. జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ మె యిన్స్ అడ్వాన్స్, నీట్‌లలో తరచూ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ పరికరాలు ఎక్కువగా అలవాటు పడ్డారని వారి పుస్తకాలతో కన్నా మొబైల్ ఫోన్లతో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టంపై తల్లిదండ్రులు వివరించాలని తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి మాట్లాడుతూ పిల్లలకు తల్లిదండ్రులే మొదటి గురువులు అని, వారిని చూసి పిల్లలు నేర్చుకుంటారని పిల్లల నడవడికను చిన్నతనం నుంచే తల్లిదండ్రులు వారికి నేర్పాలన్నారు. విజ్ఞాన భారతి నేషనల్ సెక్రటరీ సుబ్బరాయశర్మ మాట్లాడుతూ పిల్లల్లో ఆలోచనా విధానం, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలంటే పుస్తకాలు ఎక్కువచదవాలన్నారు. సదస్సులో అకడమిక్ డైరెక్టర్లు సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పి.రాయవరంలో జాతీయస్థాయి నాటికల పోటీలు ప్రారంభం



నాటికల పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నాటక పరిషత్ ప్రతినిధులు, నాయకులు

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం పి.రాయవరంలోని మాదేపల్లి శ్రీరామమూర్తి కళా వేదికపై మూడు రోజుల పాటు జరిగే 5వ జాతీయస్థాయి నాటికల పోటీలు గురువారంరాత్రి ప్రారంభమయ్యాయి. సీతారామాలయ పునర్నిర్మాణ పంచమ వార్షికోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రోత్సాహంతో శ్రీరామచంద్ర నాటక పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను పరిషత్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో నాటక పరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్నీడి జగ్గారావు, నాగాభట్ల బాపన్నశాస్త్రి, సీతారామ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మాదేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు కాకినాడ సాయికార్తీక్ క్రియేషన్స్ కళాకారులు ఎడారిలో వాన చినుకు, చిన్న తిరుపతి శృంగార వల్లభ ఆర్ట్స్ కళాకారులు కబ్జా నాటికలను ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. కాకినాడ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కొండబాబు, ప్రత్యేక అతిథిగా లలితా ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ మట్టే శ్రీనివాసు విచ్చేశారు. కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పులవర్తి కుమార్, యక్కల ప్రసాద్, కోనసీమజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వాకచర్ల సత్యనారాయణ, బచ్చు ప్రభాకర్, కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని శ్రీరామసత్యనారాయణ ప్రమాణం చేయించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ మాల్స్ వల్ల వ్యాపారాలు దెబ్బతింటున్నాయని, అందుకు అనుగుణంగా వ్యాపారాల అభివృద్ధిపై ఆర్యవైశ్యులు దృష్టిపెట్టాలన్నారు. ఆర్యవైశ్య కులస్తులకు రాజకీయాలకతీతంగా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్రంధి నారాయణరావు (బాబ్జీ), నాయకులు బచ్చు శేఖర్, దంగేటి సతీష్, బచ్చు రాజేష్, ఎస్. మోహన్‌కుమార్, ఎ.గంగరాజు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో చోరీకి పాల్పడిన దొంగ అరెస్టు

● అమ్మవారి మంగళ సూత్రాలు, శ్రీనివాసుడి వెండి కిరీటం, చెవులు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

రాయవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చిన బుద్ధి మార్చుకోని వ్యక్తి రెండు ఆలయాల్లో తిరిగి చోరీలకు పాల్పడగా దొంగను రాయవరం పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గతనెల 31న రాయవరం శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి మెడలో బంగారు మంగళ సూత్రాలు అపహరణకు గురయ్యాయి. ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసిన పోలీసులు విశ్వేశ్వరస్వామి ఆలయం ప్రక్కనే ఉన్న పోలమ్మ అమ్మవారి ఆలయం వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఫుటేజ్ ఆధారంగా దొంగ రంగపేట మండలం నల్లమిల్లి గ్రామం ముత్యాలమ్మ ఆలయ సమీపంలో తోరాటి సాయి వరప్రసాద్‌గా గుర్తించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ దొరరాజు పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గురువారం రాయవరం-మహేంద్ర రోడ్డులో పాత గ్యాస్ కంపెనీ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పోలీసులు విచారణ చేయగా అన్నపూర్ణ అమ్మవారి ఆలయంలో మంగళసూత్రాలతో పాటు ఈనెల 1న బిక్కవోలు మండ లం పందలపాక గ్రామంలో కాలువగట్టున ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వెండి కిరీటం, వెండి చెవులు అపహరించినట్లు సాయివరప్రసాద్ నేరాన్ని అంగీకరించారు. చోరీకి పాల్పడిన సాయి వరప్రసాద్ నుంచి రెండు బంగారు మంగళసూత్రాలు, సుమారు 1250 గ్రాముల వెండి కిరీటం, వెండి చెవులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సాయి వరప్రసాద్‌పై రాయవరం పోలీస్‌స్టేషన్‌లో గతంలో సోమేశ్వరం బాపనమ్మ అమ్మవారి ఆలయంలో చోరీకి పాల్పడి జైలుకి వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు. చోరీలకు పాల్పడిన సాయివరప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అనపర్తి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన, చెయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నేటి ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు.

బైక్ దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సూదాపాలెంలో గురువారం ఎం.శ్రీకృష్ణప్రభాకరరావు బైక్‌ను అమలాపురానికి చెందిన అతని బంధువు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కుటుంబ తగాదాల నేపథ్యంలో ఇది జరిగినట్టు స్థానికులన్నారు. అతని భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్ రాజేష్ తెలిపారు.

డ్రైన్ సమస్య పరిష్కరించాలంటూ ఆందోళన


మురుగునీరు పారకపోవడంతో నిండిన డ్రైన్

మామిడికుదురు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గరువు ప్రాంతంలో గల డ్రైన్ మూసుకుపోవడంతో మురుగునీరు దిగక స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బాలుర, బాలికల వసతి గృహం నుంచి వచ్చే మురుగునీరు పంపిణీకి ఏర్పాటు చేసిన ఈ డ్రైన్ మూసుకుపోవడంతో సమస్య మొదలైంది. ఇటీవల 216 జాతీయ రహదారి, డ్రైన్ పక్కన కొంత మంది గృహాలు నిర్మించడంతో ఆ సమయంలో సిమెంటు, ఇతర వ్యర్థాలు డ్రైన్‌లోపడి డ్రైన్ మూసుకుపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి సమస్యను పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడంలేదని, ఎన్నిసార్లు దీనిపై ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం చూపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి ఇక్కడి డ్రైన్‌ను సరిచేసి మురికినీరు బయటికి పోయేలా చర్యలు తీసుకోవాలని గరువు ప్రాంత వాసులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే చర్యలు


అయినవిల్లిలో షాపుల యజమానులతో మాట్లాడుతున్న డీపీవో శాంతలక్ష్మి

అయినవిల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం లోపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని అంబేడ్కర్ కోనసీమ జిల్లా డీపీవో డి.శాంతలక్ష్మి అన్నారు. గురువారం అయినవిల్లి, తొత్తరమూడి గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపు యజమానులతో ఆమె చర్చించారు. తడి,పొడి చెత్తలను వేర్వేరుగా వేయాలని సూచించారు. అయినవిల్లి క్షణ ముక్తేశ్వరస్వామి ఆలయం సమీపంలో షాపుల యజమానులతో మాట్లాడి రోడ్డు పక్కన చెత్తను వేయకుండా బుట్టల్లో వేసే ఏర్పాటు చేసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో అయినవిల్లి కార్యదర్శి కొంకి రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.


అంబాజీపేటలో బ్రాందీషాపు వద్ద ధర్నా చేస్తున్న మహిళలు, స్థానికులు

నివాస ప్రాంతాల మధ్య మద్యం దుకాణం తొలగించాలి

• షాపు వద్ద మహిళల ధర్నా • టెంటు వేసేందుకు ప్రయత్నం • అడ్డుకున్న పోలీసులు

అంబాజీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మాచవరం శివారులో నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, మహిళలు ఆందోళన జరిపారు. మాచవరం ఫీచు ఫ్యాక్టరీ వద్ద సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణాన్ని అక్కడ ఏర్పాటు చేశారు. దాన్ని ఏర్పాటు చేయవద్దంటూ షాపు ఏర్పాటు కాక ముందు నుంచి వెంకటేశ్వరకాలనీ, కుసుమవారిపేట, చిన్నకుసుమవారిపేటకు చెందిన స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికి వారి మాటలను లెక్కచేయకుండా మాచవరంలో మద్యం షాపును బుధవారం ప్రారంభించారు. దీంతో గురువారం షాపు వద్ద వారు ఆందోళన చేపట్టారు. ఒక దశలో టెంట్ వేసి దీక్షకు కూర్చునేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులు అమలాపురం ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. మద్యం తొలగించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

'మద్యం షాపును తొలగించాలి'


అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాచవరం గ్రామస్తులు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం మాచవరం ప్రధాన రహదారిని ఆనుకుని దళితవాడల మధ్య ఏర్పాటు చేసి మద్యం షాపును తొలగించాలని గురువారం అమలాపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మహిళలు ధర్నా చేపట్టారు. వీరికి సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీమాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ ఆలయ ప్రతిష్ఠ

యానాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని కొత్తపేట గ్రామంలో శ్రీమహాలక్ష్మమ్మ అమ్మవారి నూతన ఆలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠను గ్రామస్తులు ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతిష్ఠలో భాగంగా మూడు రోజుల నుంచి ఆలయ ప్రాంగణంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. గురువారం ఉదయం 7.47 గంటలకు యంత్రస్థాపన, విగ్రహ స్థాపన, శిఖర, పోతురాజు బలిపీఠ విగ్రహ స్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, సతీమణి ఉదయ లక్ష్మి దంపతులు పాల్గొని పూజలు చేశారు. యానాం పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న మల్లాడి దంపతులు

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు ఐ.పోలవరానికి చెందిన వెన్న శ్రీరామరవికృష్ణుడు దంపతులు రూ.10,116లు గురువారం ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాతలకు ప్రత్యేక దర్శనంతో పాటు స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దాత దంపతులను ఆలయ సహాయ కమీషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. ఆలయ అర్చకుడు యనమండ్ర సుబ్బారావు పాల్గొన్నారు.

కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఐ.పోలవరం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మురమళ్ళలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండవ రోజు నిర్వహించారు. సుదర్శనం వెంకటజనార్థనాచార్యుల ఆధ్వర్యంలో ఇవి జరుగుతున్నాయి. నడింపల్లి చినవెంకట్రాజు, వెంకటసత్యసౌజన్య దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఈ నెల 4న జరగనుంది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

వివేకానంద విద్యార్థులకు అవార్డు

మలికిపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఒలింపియాడ్‌లో విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు కరస్పాండెంట్ ప్రసాద్ తెలిపారు. గత డిసెంబరులో జరిగిన గోదావరి ఒలింపియాడ్‌లో 9, 10 తరగతులు చదువుతున్న తాడి ప్రిన్స్, నల్లి దీక్షితలు గోదావరి తెలుగు, హిందీ ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి మిగిలిన విద్యార్థులకు ఆదర్శంగా నిలిచారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని అభినందించారు.

పూర్వపు విద్యార్థుల సహకారంతో వంట షెడ్ నిర్మాణం

అంబాజీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1969 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో వంట షెడ్‌ను నిర్మిస్తున్నారు. గురువారం షెడ్ నిర్మాణానికి వారు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అరిగెల బలరామమూర్తి, కొర్లపాటి గోపి తదితరులు పాల్గొన్నారు.

గొల్లవిల్లి హైస్కూల్లో యాక్టీజన్ క్లబ్‌లు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్లో 6, 7 తరగతుల విద్యార్థులతో యాక్టీజన్ క్లబ్‌లు ఏర్పాటు చేసినట్టు హెచ్ఎం లంక రాణి గురువారం తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు.

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు పోటెత్తిన లబ్ధిదారులు


అంబాజీపేటలో ఇంటర్వ్యూలకు హాజరైన లబ్ధిదారులు

అంబాజీపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్‌ల రుణాల మంజూరుకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో జీవీ సరోవరరావు పర్యవేక్షణలో బ్యాంకు మేనేజర్లు, సచివాలయ ఉద్యోగులు 1397 మంది లబ్ధిదారులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, అంబాజీపేట, పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంకు, అంబాజీపేట, ముక్కామల స్టేట్ బ్యాంక్, నేదునూరు ఇండియన్ బ్యాంకు మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పలు కార్పొరేషన్ల రుణాలకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీవో డి.రాంబాబు తెలిపారు. తాటిపాక, పొదలాడ, సోంపల్లి, పాలగుమ్మి, శివకోడు, చింతలపల్లి, కాట్రేనిపాడు, మెరకపాలెం గ్రామాల నుంచి 685 మంది దరఖాస్తులు చేశారన్నారు. 685 మందికి గాను ఇంటర్వ్యూలకు 501 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో వివిధ బ్యాంకుల అధికారులు, ఏవో ఎంవీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ ఎండీహెచ్ రెహ్మాన్, సెక్రటరీలు ఎస్వీ సత్యప్రసాద్, ఎం.కృష్ణలు లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు జరిపారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): బీసీ, ఓసీ కార్పొరేషన్‌ల రుణాలకు సంబంధించి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీవో కెవి ప్రసాద్ తెలిపారు. రెండు రోజులకు సంబంధించి ఆయా గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయా ఇంటర్వ్యూల్లో పలువురు బ్యాంక్ మేనేజర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

1,300 మందికి ఇంటర్వ్యూలు

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): బీసీ, ఓసీ కార్పొరేషన్‌ల రుణాల నిమిత్తం గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణ దరఖాస్తుదారులతో కిక్కిరిసింది. ఈ ఇంటర్వ్యూలకు 1,300 మంది హాజరైనట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పీఆర్సీ రాజ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తుదారుల్లో మహిళలే అధిక సంఖ్యలో రావడం విశేషం.

కార్పొరేషన్ రుణాల సంఖ్య పెంచాలి

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాల సంఖ్యలను పెంచాలని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కేశనపల్లి సర్పంచ్, తెలుగుదేశం నాయకుడు యెనుముల నాగు ఒక ఆడియో ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతున్నట్టు తెలిపారు. మండలంలో 1500 మంది బీసీ, కాపు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకుంటే 111 మంజూరు చేశారని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో రావడానికి కాపులు, వెనుకబడిన వర్గాలు ఎంతో కృషి చేశాయని, వారిని దృష్టిలో పెట్టుకుని రుణాల సంఖ్యను పెంచాలన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు నేడు ఇంటర్వ్యూలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ముమ్మిడివరం ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. మండలంలో వాటికి దరఖాస్తు చేసుకున్న వారికి ముమ్మిడివరం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకు ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు అప్లికేషన్, ఫొటో, ఆధార్ కార్డు, కులధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణపత్రాల జిరాక్సు కాపీలను తీసుకురావాలని ఆయన తెలిపారు.

భద్రాచలం కల్యాణానికి మోటారు సైకిల్‌పై పయనం

మలికిపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే రాములవారి కల్యాణానికి మోరి నుంచి మోటారు సైకిల్‌పై మోరి గ్రామానికి చెందిన ఏలూరి శివ గురువారం బయలు దేరారు ఐదు రోజుల వరకు భద్రాచలంలోనే ఉంటానని తెలిపారు. గతంలో అయోధ్య రామ మందిరం ప్రారంభం సందర్భంగా ఇంటింటికీ తిరిగి భక్తులతో రామకోటి రాయించి భద్రాచలంలో అందజేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శ్రీరామ అనే నామాలను అచ్చు వేయించి భక్తిని చాటుకున్నారు.


కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న పాశర్లపూడివాసులు

కలెక్టర్‌కు సన్మానం

మామిడికుదురు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి 216 జాతీయ రహదారి నుంచి పాశర్లపూడిలంక వరకు రోడ్డు ఏర్పాటు చేయడంపై కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను గురువారం పాశర్లపూడి గ్రామస్తులు అమలాపురంలో సత్కరించారు. జిల్లా పరిషత్‌కు చెందిన ఈ రోడ్డును రూ.2.17 కోట్లతో సీసీ రోడ్డుగా ఏర్పాటు చేశారు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును ఆధునికీకరించడంతో స్థానికులు గురువారం జిల్లా కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, తాడి శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి

యానాం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గోపాల్ నగర్‌లో డంపింగ్ యార్డు వద్దంటూ స్థానికులు చేస్తున్న ఆందోళన 14 రోజుకు చేరుకుంది. ఆందోళన చేస్తున్న గ్రామస్తులకు యానాం కాంగ్రెస్ నాయకులు మల్లాడి సత్తిబాబు మద్దతు పలికారు. ఈ అంశాన్ని పుదుచ్చేరి కాంగ్రెస్ ఎంపీ వైద్యలింగం దృష్టికి తీసుకు వెళతామన్నారు.


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సాయిశ్రుతి

సాధారణ కాన్పుతో తల్లీ, బిడ్డకు మేలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సాధారణ కాన్పు వల్ల తల్లీ, బిడ్డకు క్షేమమని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సాయిశ్రుతి పేర్కొన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో ఆమె గర్భిణులకు అవగాహన కల్పించారు. సాధారణ ప్రసవానికి కౌన్సెలింగ్ తీసుకోవడం మంచిదని తద్వారా మరణాల రేటు తగ్గుతాయని ఆమె తెలిపారు. గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకుని వైద్యుల సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బిడ్డకు ముర్రిపాలు ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, పలువురు గర్భిణులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది ఆలయానికి మహర్దశ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది ఆలయానికి మహర్దశ రానుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆయన ఆలయ అధికారులు, స్థానిక నియోజకవర్గ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా స్వామివారి దేవస్థానం బకాయిలు వసూలు, శిస్తు పెంపుదలపై చర్చించారు. అంతర్వేదికి వచ్చే రహదారులను వెడల్పు చేయడం, ఆలయానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌తో పాటు అనుబంధ ఆలయమైన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం తదితర పలు అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆలయం వద్ద దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, బైరా నాగరాజు, గుబ్బల ఫణికుమార్, ఉండపల్లి అంజి, పోతురాజు సురేష్, పొన్నాల ప్రభ, బర్రే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు లేకుండా ఆక్రమణలు తొలగించాలి


ఆక్రమణలను కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ట్రాఫిక్ విపరీతంగా పెరగడంతో నూతన వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. గురువారం ఈదరపల్లి వంతెన వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. వంతెన స్థితిగతులు, రాకపోకలపై ఎమ్మెల్యే ఆనందరావు కలెక్టర్‌కు వివరించారు. వంతెనకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి అడ్డంకులు లేకుండా ఆక్రమణలు తొలగించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వంతెన వద్ద ఉన్న ఆక్రమణల వివరాలను ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్ పలివెల అశోక్ ప్రసాద్‌లు కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమణలను తొలగించిన వెంటనే మేలో నూతన వంతెన నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం నడిపూడి లాకుల వద్ద ట్రాఫిక్ మళ్లింపు కోసం ఎమ్మెల్యే ఆనందరావు ప్రతిపాదించిన నూతన వంతెన నిర్మాణ స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, ఎంపీడీవో ఉండ్రు బాబ్జిరాజు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఆర్అండ్‌బీ డివిజనల్ ఇంజనీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సీబీఐతో విచారణ జరిపించాలి


ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని కోరుతూ ముమ్మిడివరంలో నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ, మానవహారం, ధర్నా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక కాశివానితూము సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయంలో ర్యాలీ జరిపారు. పోలీసుస్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించి అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహశీల్దార్ ఎంవీ సుబ్బలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల పాస్టర్లు, పాస్టర్ ఫెలోషిప్ సమాఖ్య నాయకులు పాల్గొన్నారు. సీఐటీయూ, కులవివక్ష పోరాట సమితి మద్దతు పలికారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల క్రైస్తవ సంఘ అధ్యక్షులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ పరిమితి పెంచాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్‌ను 62 ఏళ్లకు పెంచాలని ముమ్మిడివరం నగర పంచాయతీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గురువారం కమిషనర్ పి.రవివర్మ, ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణలకు వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వం గత నెల 26న విడుదల చేసిన జీవోను ఉపసంహరించుకోవాలన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేయవద్దని, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించద్దని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సంఘ నాయకులు పెట్టా శివప్రసాదరావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, జి.రమేష్, ఆర్.అరుణ పాటు పలువురు పాల్గొన్నారు.

ఓడలరేవులో కొనసాగుతున్న నిరసన

అల్లవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ రోడ్డులో గ్రామస్తుల నిరాహార దీక్ష గురువారం 32వ రోజుకు చేరింది. ఓఎన్జీసీ అధికారులు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ నినాదాలు చేశారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు తదితరులతో పాటు, గ్రామస్తులు, మహిళలు రిలే దీక్షలో పాల్గొన్నారు.

సొసైటీ సీఈవో మృతికి సంతాపం

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు సహకార సొసైటీ సీఈవో సత్తి వెంకటేశ్వరరావు అకాల మరణం పట్ల అల్లవరం డీసీసీబీ బ్రాంచి కార్యాలయంలో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సీఈవో మృతికి సంతాపంగా శుక్రవారం మండలంలోని 8 సహకార సంఘాలు బంద్ పాటించేలా నిర్ణయం తీసుకున్నారు. సహకార అధికారులు, ఉద్యోగులు మౌనం పాటించారు. నోడల్ అధికారి కె.ఆనంద్‌కుమార్, డీసీసీబీ బీఎం జీఆర్ ప్రియదర్శిని తదితరులు సంతాపం తెలిపారు.

అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

ముమ్మిడివరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక పంచాయతీ పరిధిలోని కూనాలంకలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో దండుమేను శ్రీనివాస్ ఇల్లు దగ్ధమైంది. ఇంటిలోని పొయ్యి నుంచి నిప్పు రవ్వల కారణంగా మంటలులేచి తాటాకిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ ఇంట్లోనే గృహోపకరణ వస్తువులు, దుస్తులు దగ్ధమయ్యాయి. ముమ్మిడివరం అగ్నిమాపక అధికారి కొండబాబు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపు చేశారు.

ఉపాధి కూలీలకు అవగాహన

మామిడికుదురు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ఉపాధి హామీ కూలీలకు ఈదరాడ పంచాయతీ కార్యదర్శి పీవీఆర్కే రాజు గురువారం అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అన్నసమారాధన

అంతర్వేది, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం వీవీమెరక పళ్లాలమ్మ, సఖినేటిపల్లిలంక కనకదుర్గమ్మ, సఖినేటిపల్లి పాలెం ముత్యాలమ్మ, గొంది, రామేశ్వరం, అంతర్వేది, సైకిల్‌షాపు సెంటర్, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద కుంకుమ పూజలు, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అంతర్వేది సైకిల్‌షాపు సెంటర్‌లో కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.


రామాలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం

మామిడికుదురు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పెదపట్నంలంకలో ఉన్న కోదండ రామాలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించి చామంతి పూలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేషాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని రాములవారిని దర్శించుకున్నారు.


దేవగుప్తంలో ఉమా మల్లేశ్వరుడికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

ఉమా మల్లేశ్వరుడికి లక్ష బిల్వార్చన

అల్లవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేవగుప్తం ఉమామల్లేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఉమామల్లేశ్వరాలయంలో మరువాడ వెంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది నరసింహమూర్తి బ్రహ్మత్వాన పోచినపెద్ది శ్యామ్‌శర్మ, సందీప్ శర్మ, మంగళంపల్లి పాండురంగవిఠల్, వేద పండితులు లక్ష బిల్వార్చన, చండీయాగం, నక్షత్ర పూర్వక నవగ్రహ హోమాలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. దేవగుప్తం పరిసర గ్రామాల భక్తులు ఉమామల్లేశ్వరుడిని దర్శించుకున్నారు.

నెలాఖరు వరకు సెక్షన్ 30 అమలు

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురం సబ్ డివిజనల్ పోలీసు అధికారి కార్యాలయం పరిధిలోని ప్రాంతాల్లో ఈ నెల 30 వరకు సెక్షన్ 30 అమలులో ఉంటుందని డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. అమలాపురంతో పాటు అల్లవరం, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన పోలీసుస్టేషన్ల పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉంటుందన్నారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను అతిక్రమించి ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

13న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకళా గ్రాండ్ రెసిడెన్సీలో 13న ఉగాది జాతీయ కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు సంస్థ అంతర్జాతీయ సీఈవో కె.ప్రతాప్ తెలిపారు. కవి సమ్మేళనం బ్రోచర్లను గురువారం అమలాపురంలో ఆవిష్కరించారు. కళావేదిక జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు రుద్రరాజు నానిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జాతీయస్థాయి శతాధిక కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, జాతీయ కమిటీ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


చెరువు తవ్వుతున్న దృశ్యం

మిలట్రీపేట వాసుల ఆందోళన

కాట్రేనికోన, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నివాసాల సమీపంలో చెరువుల తవ్వకాలు ఆపాలని కందికుప్ప గ్రామ మిలట్రీపేట వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో తవ్విన చెరువుల వల్ల రోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పది ఎకరాల్లో చెరువులు తవ్వడానికి సిద్ధపడుతుండగా అడ్డుకున్నారు. దీనిపై కాట్రేనికోన తహసీల్దార్‌కు వారు ఫిర్యాదు చేశారు. న్యాయం చేయకపోతే కోర్టును ఆశ్రయిస్తామని బాధితులన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

అల్లవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి మహాత్మాగాంధీ ఎన్ఆర్ఈజీఎస్ ఉపాధిహామీ పనులను ప్రారంభించారు. ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, చింతం శ్రీనివాస్, నీటిసంఘ డైరెక్టర్ దొమ్మేటి భావన, దొమ్మేటి రామకృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సింగంపల్లి దుర్గాశ్రీనివాస్, ఫీల్డు అసిస్టెంట్ బొంతు శ్యామ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నిబంధనలు అనుసరించి రోడ్లు నిర్మించాలి



అముజూరులో రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలు

కె.గంగవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు అనుసరించి సీసీ రోడ్లు నిర్మించాలని టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ అన్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీ, రజక కాలనీకి రెండు రహదారులు సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి ఎంపీ గ్రాంటు కింద రూ. పది లక్షలు మంజూరైంది. వాటిని గురువారం నాయకులు పరిశీలించారు. పూర్తి నాణ్యత, నిబంధనలు అనుసరించి నిర్మించాలని కాంట్రాక్టర్‌ను సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నానావరపు కల్యాణి, మేడిశెట్టి శ్రీనివాస్, నానావరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



డీపీవోకి చెత్తసేకరణ అంశాలు వివరిస్తున్న కార్యదర్శి సత్యనారాయణ

కె.గంగవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీపీవో శాంతలక్ష్మి అన్నారు. గురువారం కోట, సత్యవాడ, దంగేరులో ఆమె పర్యటించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో పం చాయతీ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ జరుగుతున్న విధానాన్ని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈవోపీఆర్డీ గౌరీ కుమారి, ఆయాగ్రామాల కార్యదర్శులు ఎస్. రామకృష్ణ, సూర్య గౌతమి, ఎస్. సత్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పునఃనిర్మాణ పనుల పరిశీలన



లొల్లలో చెత్త నుంచి సంపద తయారీ పనులు పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లొల్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద జరుగుతున్న పునఃనిర్మాణ పనులను గురువారం ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. రూ. ఎనిమిది లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించగా, తొలుత పంచాయతీ ప్రత్యేక నిధులు రూ. నాలుగు లక్షలతో పైకప్పు, తదితర ఆధునీకరణ, తదితర పనులు నిర్వహిస్తున్నారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎ.గోవిందరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ వ్యక్తిత్వంపై దుష్ప్రచారం తగదు



రాయవరంలో పాస్టర్ ప్రవీణ్ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల వ్యక్తిత్వంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాయవరం మండల పాస్టర్ ఫెలోషిప్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాయవరంలో ఫెలోషిప్ నాయకులు మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జె.సాల్మన్ రాజు, సెక్రటరీ ఎం. ప్రభవ కుమార్, వి.శ్యామ్యూల్ రాజు ఎం.విలియం కేరీ, బి.చార్లెస్, పి.ఎఫ్రాయిము, సీహెచ్ లివింగ్స్టన్, మండలంలోని వివిధగ్రామాలకు చెందిన చర్చి పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ ఆత్మశాంతి కోసం శాంతి ర్యాలీ



మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం క్రైస్తవ సమాజాలకు తీరని లోటని అపోస్తలిక్ సంఘాల చైర్మన్ అంగరప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో క్రైస్తవసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు దూళిజయ రాజు, సవరపు సతీష్, విజయ కుమార్, భారీసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు వద్దు..ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

● ఆర్తమూరులో వినూత్నరీతిలో ఇంటింటా ప్రచారం



ఆర్తమూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు

మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) ప్రైవేట్ పాఠశాలల్లో విద్య వద్దు ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యే ముద్దు అంటూ వినూత్న రీతిలో ఆర్తమూరులో టీడీపీ నేతలు, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో తిరిగే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యలో తేడా గురించి తెలిపారు. ప్రభుత్వపరంగా విద్యార్థులకు అందుతున్న రాయితీల పిల్లల తల్లితం డ్రులకు వివరించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్టు చెప్పారు. అలాగే కార్పొరేట్‌కు దీటుగా చదువు అందించటం జరు గుతుందన్నారు. పిల్లల తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మోజు తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.వీర్రెడ్డి, పి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో గృహాల పంపిణీ

● మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి

మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణం గొల్లపుంతకాలనీ పేజ్-2 టిడ్కో గృహాలను త్వరలోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి గురువారం తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్, ఇతర సమస్యలపై మున్సిపల్, టిడ్కో అధికారులు సంయుక్తంగా కాలనీలో శిబిరాన్ని ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నారన్నారు.

నేడు కేశవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేశవరంలో రబీ సీజన్‌కు సంబంధించి శుక్రవారం రైతుసేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్టు ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా రైతుసేవా కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాట ధర పొందాలని ఆయన సూచించారు.

మండపేటలో నవోదయ 2.0 కార్యక్రమం

మండపేట ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాటు సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయ 2.0 కార్యక్రమాన్ని అమలు చేస్తుందని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అమర్‌బాబు అన్నారు. కేశవరం, ఏడిద వెలగతోడులో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం నాటుసారా నిర్మూలన, తాగితే కలిగే అనర్థాల గురించి వివరించారు. అలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఎస్ఐ రాంబాబు, పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

● 13వ రోజుకు మహిళల రిలే నిరాహార దీక్షలు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న వార్డు మహిళలు

మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సప్తగిరి థియేటర్‌కు ఎదురుగా ఏర్పాటు చేసే గీత కార్మికుల మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ మూడు వార్డులకు చెందిన మహిళలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురు వారంతో మూడువ రోజుకు చేరుకున్నాయి. ఇప్పటికే మహిళలు ఆందోళన చేపట్టి 18 రోజులు కావస్తున్నప్పటికీ అధికారులెవరు స్పందించటం లేదని వారంతా వాపోతున్నారు. ఇళ్ల సమీపంలో దుకాణం ఏర్పాటు చేస్తే తమకు కలిగే ఇబ్బందులపై చేస్తున్న నిరసన ఎవరికీ పట్టదా? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

ఈసీజీ మెషిన్ బహూకరణ



ఈసీజీతో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : అంగర పీహెచ్‌సీకి ఇదే గ్రామానికి చెందిన సంకాబత్తుల సుబ్బారావు మనవడు బిరద సూర్యప్రకాష్ గురువారం ఈసీజీమెషిన్ బహూకరించారు. ఈ మెషిన్‌ను రాగం రామచంద్రరావు ప్రారంభించారు. కార్యక్రమానికి అంగర, పడమరఖండ్రిక గ్రామాల సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంపీటీసీలు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పెద్దింశెట్టి శేషారత్నం, తమ్మయ్య, ఉపసర్పంచ్ యర్రా వీరన్నబాబు, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి పుత్సల శ్రీనివాస్, పిల్లా బసవరాజు, మాజీసర్పంచ్‌లు సంకాబత్తుల స్వామి కాపు, కొండేటి నాగేశ్వరరావు, వైద్యాధికారిణి రత్నకుమారి, ఎంపీహెచ్‌ఈవో జె. మల్లిఖార్జునుడు, హెచ్‌ఈ రామారావు, హెచ్‌వీ మేరీమణి, వైద్య ఆరోగ్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు హాజరైనట్టు ఎంపీడీవో రత్నకుమారి తెలిపారు. మొత్తం 653 మంది లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 402 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. బ్యాంకు మేనేజర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

'చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకోవాలి'

మండపేట, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు పార్లమెం ట్‌లో ఆమోదముద్ర పొందిన విషయంలో సీఎం చంద్రబాబు అవలంబించిన తీరుతో ముస్లింల ద్రోహిగా నిలిచిపోయారని వైసీపీకి చెందిన షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా ఆరోపించారు.గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ముస్లింల విషయంలో బాబు తన నిర్ణయాన్ని పునరాలోచించాలన్నారు.

ఎంపిక ఇంటర్వ్యూలు వాయిదా

కె.గంగవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక కోసం శుక్రవారం ఏర్పాటు చేసిన బ్యాంకర్ల ఇంటర్వ్యూలు వాయిదా పడినట్టు ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే తెలియజేస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ సోమును కలిసిన నియోజకవర్గ బీజేపీ శ్రేణులు



వీర్రాజుతో ఉన్న బీజేపీ నాయకులు

మండపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) బీజేపీ ఎమ్మెల్సీ సోమువీర్రాజు రెండోసారి ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆయన్ని మండపేట నియోజకవర్గానికి చెందిన బీజేపీ నేతలు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, కేఎం కృష్ణ, రఘువీర్, సీహెచ్ భార్గవ్‌చౌదరి, వీ.రవీంద్రబాబు, తదితరులు కలిసినవారిలో వున్నారు.

నేడు వెదురుపాకలో వైద్యశిబిరం

రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక జనార్దన స్వామి ఆలయంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు కాపు ఐక్య సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కాపు ఐక్య సంఘం నాయకులు మాట్లాడుతూ కాకినాడకు చెందిన వైద్య బృందం పాల్గొని కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, దీన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు వెంకన్న కల్యాణం

రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నక్షత్రక ల్యాణం శుక్రవారం నిర్వహించనున్నట్టు భక్త సంఘం సభ్యులు తెలిపారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా చైత్ర మాసం మృగశిర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణం వైఖానస ఆగమం ప్రకారం నిర్వహిస్తామన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేయాలి

రాయవరం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం లొల్ల గ్రామ పంచాయతీ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సర్పంచ్, ఎంపీటీసీ వైట్ల సతీష్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా విలేజ్ చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ గ్రామ స్థాయి కమిటీని నియమించారు.

కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలకు పోటెత్తిన అభ్యర్థులు



రామచంద్రపురంలో ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థులు

ద్రాక్షారామ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి):వివిధ కార్పొరేషన్ల రుణాల మంజూరుకు లబ్ధిదారుల ఎంపికకు గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు అభ్యర్థులు పోటెత్తారు. బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఒకే రోజున ఇంటర్వ్యూలు నిర్వహించడంతో మండల పరిషత్ కార్యాలయం కిక్కిరిసింది. బీసీ కార్పొరేషన్ రుణాలకు 953 మంది దరఖాస్తు చేసుకోగా 565 మంది, కాపు కార్పొరేషన్ రుణాలకు 1358 మంది దరఖాస్తు చేసుకోగా 782 మంది, ఈబీసీ కార్పొరేషన్ రుణాలకు 93 మంది దరఖాస్తు చేసుకోగా 50 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మొత్తం 2404 మంది దరఖాస్తు చేసుకోగా 1397 మంది హాజరయ్యారు. ఎంపీడీవో కె.పద్మజ్యోతి, ఈవోపీఆర్డీ షెలట్‌రాజు, మండల పరిషత్ కార్యాలయ ఏవో చాగంటి సుబ్రహ్మణ్యం, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. గతంలో బ్యాంకుల వారీగా దఫదఫాలుగా ఇంటర్వ్యూలు నిర్వహించే వారు అయితే ఈ సారి అన్ని కార్పొరేషన్ల రుణాలకు ఒకే రోజున ఇంటర్వ్యూలు నిర్వహించడంతో అభ్యర్థులు ఉదయం నుంచి సాయం త్రం వరకు పడిగాపులు కాచారు. నానా అవస్థలు పడ్డారు.

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలించారు. ఎంపీడీవో ఎ.రాజు అధ్వర్యంలో 296 మంది లబ్ధిదారుల దరఖాస్తులు, సర్టిఫికెట్లను పరిశీలించి, యూనిట్ వివరాలను సేకరించారు. మండలంలోని 18గ్రామాల నుంచి దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను నేరుగా అందించి వివరాలను అందించారు.



ఆలమూరులో సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉంచాలి



రావులపాలెం గ్యారేజీలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈడీ విజయరత్నం

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం

రావులపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి కాంప్లెక్స్‌లో శుద్ధమైన తాగునీరు అందించడంతో పాటు వసతులు సక్రమంగా నిర్వహించి వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం సూచించారు. రావులపాలెం ఆర్టీసీ డిపోను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆర్టీసీ గ్యారేజీలో మొక్కనాటి అన్ని సెక్షన్లను తనిఖీ చేశారు. గ్యారేజీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను సందర్శించి ఆపై మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలన్నారు. వేసవి నేపథ్యంలో రక్షిత మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. కాంప్లెక్స్ పరిసరాలు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట జిల్లా డీపీటీవో ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జీజీవీ రమణ, సిబ్బంది ఉన్నారు.

నాలుగు స్కూల్ ఆటోల సీజ్

కొత్తపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. రహదారి భద్రత నియమాల్లో భాగంగా గురువారం కొత్తపేట పరిసర ప్రాంతాల్లో స్కూల్ పిల్లల్ని తీసుకుని వెళ్లే ఆటోలను, టాటా మ్యాజిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తున్న నాలుగు ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత విషయంలో ఉపేక్షించేదిలేదని స్కూల్ యజమాన్యం, తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. దీనిపై త్వరలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తపేటలో స్కూల్ ఆటోలను తనిఖీ చేస్తున్న డీటీవో శ్రీనివాసరావు

7న రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఎన్నికల అధికారి చలపతికుమార్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 7న జరుగనున్నాయి. అసోసియేషన్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి పదవులకు ఇద్దరు చొప్పున నామినేషన్లు దాఖలు చేయడంతో ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి టి.చలపతికుమార్ తెలిపారు. మహిళా న్యాయవాదుల ప్రతినిధిగా లకాని పద్మకమల కుమారి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఎన్నికల పోలింగ్ 7న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందని తెలిపారు. బార్‌అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఉండవల్లి గోపాలరావు, మామిడపల్లి వెంకట సుబ్బారావు పోటీ పడుతుండగా ప్రధాన కార్యదర్శి పదవికి బొడ్డు వరహా నరసింహమూర్తి, నీలం మధుసూధనరావు, కోశాధికారి పదవికి చింతపల్లి శ్రీనివాసరావు, దొంతంశెట్టి ఓం ప్రకాష్, ఉపాధ్యక్ష పదవికి దొంతుకుర్తి సూర్య సుబ్రహ్మణ్యశర్మ, గోవర్ధనం మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి పదవికి ఎస్‌వీవీ శేషుకుమార్, పీవీఎస్ జానకి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ పదవికి జేఎస్ఎస్ చక్రవర్తి, సాదే నారాయణరావు పోటీ పడుతున్నట్టు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారులుగా బండి శ్రీనివాస్, కుడుపూడి కిరణ్ శ్రీనివాసు వ్యవహరిస్తున్నారు.

కొత్తపేటలో సెక్షన్ 30

డీఎస్పీ మురళీమోహన్

కొత్తపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్‌సబ్ డివిజన్‌పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉన్నట్లు డీఎస్పీ సుంకర మురళీమోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం, పి.గన్నవరం, అంబాజీపేట, నగరం, అయినవిల్లి, రాజోలు, సఖినేటిపల్లి, మల్కిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సెక్షన్-30 అమలులో ఉన్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జాతర్లు, తీర్థాలు జరిగినప్పుడు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ఉద్యమాలు, రాజకీయ సమావేశాలు, సభలు, ఏర్పాటు చేసినప్పుడు పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరి అని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ సెక్షన్ 30 అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

మడికిలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ

ఆలమూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మడికిలో నిర్మించిన శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ గురువారం జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆలమూరు మసీదు రోడ్డును త్వరలోనే పూర్తి చేస్తాం

ఆలమూరు, ఏప్రిల్ 3(ఆంధ్ర జ్యోతి): ఆలమూరు మసీదు రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీరు సూర్యనారాయణ తెలిపారు. ఈ నెల 1న ఆంధ్రజ్యోతిలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఎమ్మెల్యే హామీకి తూట్లు అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ రోడ్డుకు సంబంధించిన బిల్లులు పెండింగ్ కారణంగా నిర్మాణం పూర్తి చేయడంలో కొంత ఆలస్యమైందని త్వరలోనే పూర్తి చేస్తామని సూర్యనారాయణ వివరించారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ద్రాక్షారామ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఆదివారపుపేటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేదపండితులు పూజాదికాలు, హోమం నిర్వహించారు. అలాగే ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవ పూజలు జరిగాయి. వాసంశెట్టి సత్యంతోపాటు గ్రామస్థులు అధిక సంఖ్యలో పూజాదికాల్లో పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యప్రదర్శన

రావులపాలెం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసలి రామాలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ విఘ్నేశ్వర వైష్ణవి కూచిపూడి నృత్య పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన అందర్ని ఆకట్టుకుంది.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఎక్సైజ్ ఏఈఎస్ అమర్‌బాబు



చొప్పెల్లలో నవోదయం-2 వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): సారా వల్ల కలిగే అనర్థాలను గుర్తించి ప్రతీ గ్రామాన్ని సారా రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒకరు కృషి చేయాలని జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమర్‌బాబు కోరారు. ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆలమూరు మండలం మడికి, చొప్పెల్ల, మండపేట మండలం కేశవరం, ఏడిద, వెలగతోడు గ్రామాల్లో నవోదయం-2 కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. వీటికి ఏఈఎస్ అమర్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేయడం నేరమని, పూర్తిగా మానుకోవాలని సూచించారు. సారా అమ్మకం, తయారీదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయయనున్నామని హె చ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు రాంబాబు, శ్రీనివాస్, పలువురు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ హెచ్‌సీ శ్రీనివాస్‌కు పదోన్నతి



ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న గెడ్డం శ్రీనివాస్‌కు ఎస్ఐగా పదోన్నతి లభించింది. ఆయనను ఆలమూరులోనే ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను సీఐ నాగేశ్వరరావు, సిబ్బంది అభినందించారు.

స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్‌తో చేనేత రంగ అభివృద్ధి



చేనేత కార్మికులకు సోలార్ యూనిట్లు అందజేస్తున్న సత్యం

ద్రాక్షారామ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్మాల్ క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం దోహదం చేస్తుందని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురం మండలం ఆదివారపుపేట శివబాల యోగి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో స్మాల్‌క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చేనేత కార్మికులు 25 మందికి సోలార్ యూనిట్లు అందజేశారు. ఈ పథకంలో ఇప్పటికే మంత్రి సుభాష్ జాకాడ మోటార్లు, మిషన్లు అందజేశారన్నారు. సోలార్ యూనిట్ల కారణంగా విద్యుత్ బిల్లు ఆదాకావడంతో పాటు విద్యుత్ అంతరాయం కలిగిన సమయంలో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం సిబ్బంది, కార్మికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ సంఘీభావ చెక్కు పంపిణీ

ఆలమూరు, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నర్సిపూడి జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ మృతి చెందిన ఉపాధ్యాయుడు ఆనందరావు కుటుంబానికి యూటీఎఫ్ ఆలమూరు శాఖ తరపున అందించే సంఘీభావ రూ.3లక్షల చెక్కును ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా ఆనందరావు కుటుంబసభ్యులకు అందించారు. నర్సిపూడి హైస్కూల్లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు దున్నే స్వామినాయుడు, రాయుడు బాబ్జీ, ఈదల సత్తిబాబు, యూటీఎఫ్ నాయకులు వైవీ రమణ, వీవీఎస్ఎన్ మూర్తి, దాసరి నాగేశ్వరరావు, బొంతు లోకేశ్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,50,789 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.